RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 327 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

ఆదివారం 16, ఏప్రిల్ 2023

## రైతుల అభివృద్దే లక్ష్యం

- ఏడాదిలో ఉచితంగా 5 సిలిండర్ల పంపిణీ
- గర్భిణీ స్త్రీలకు నెలకు 9వేల ఆర్థిక సాయాం
- వింతు పెన్షన్ 900నుంచి 2500కు పెంపు
- కర్నాటకలో మేనిఫెస్టో విడుదల చేసిన జెడిఎస్

బెంగళూరు, ఏప్రిల్ 15 (ప్రజా మంటలు): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జేడీఎస్ నేత, మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవెగౌడ 12 పాయింట్లతో ఎన్నికల మేనిఫెస్టోను శనివారంనాడు విడుదల చేశారు. మహిళా సాధికారిత, రైతుల అభివృద్ధికి మేనిఫెస్టోలో పార్టీ పెద్దపీట వేసింది. స్త్రీ శక్తి గ్రూపులు తీసుకున్న రుణాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ఏడాదిలో

మిగతా... 2లో



Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



## తప్పిన ముప్పు

- జపాన్ ప్రధాని ఫుమియో కిషిదాకు తప్పిన ముప్పు
- ప్రధాని సభ వద్ద పొగబాంబు విసిరిన యువకుడు
- గుర్తించి పట్టుకున్న పోలీసులు

టోక్యో,ఏప్రిల్15(ప్రజా మంటలు): జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిదాకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. శనివారం వకయామలోని సైకాజకి పోర్ట్‌లో ప్రధాని కిషిదా పర్యటించారు. కాసేపట్లో ఓ కార్యక్రమ వేదికపై ప్రధాని ప్రసంగం చేయాల్సి ఉండగా, వేదికకు సమీపంలో బాంబు పేలుడు శబ్దం వినిపించింది. దీంతో ఒక్కసారిగా అంతా ఉలిక్కిపడి అక్కడి నుంచి పరుగులుతీశారు. వెంటనే

మిగతా... 2లో

## భీవండి కేసులో రాహుల్‌కు ఊరట

- ప్రత్యక్ష హాజరుపై కోర్టు మినహాయింపు

న్యూఢిల్లీ,ఏప్రిల్15(ప్రజా మంటలు): వరుస వివాదాలు.. ఎంపీగా అనర్హత వేటు...పలు రాష్ట్రాల్లోపరువు నష్టం దావా కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కాంగ్రెస్ సీనియర్ లీడర్ రాహుల్ గాంధీకి స్వల్ప ఉపశమనం లభించింది.

మిగతా... 2లో



- గత ప్రభుత్వాల వారసత్వంగా చెత్త
- శుద్ధి చేసేపనిని పెద్ద ఎత్తున చేపట్టాం
- జవహర్ నగర్‌లో శుద్ధి ప్లాంట్ ప్రారంభించిన కెటిఆర్

# జవహర్‌నగర్ సమస్య తీరుస్తాం

హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు): చెత్త కుప్పను గత ప్రభుత్వాలు తమకు వారసత్వంగా ఇచ్చి వెళ్లాయని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్య గత ప్రభుత్వాల శాపమని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రాంగణంలో లీచెట్ శుద్ధి ప్లాంట్‌ను మంత్రి మల్లారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. చెత్త నుంచి కరెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ శుద్ధి ప్లాంట్‌ను రూ. 250 కోట్లతో రాంకీ సంస్థ రెండు ఎంఎల్‌డీల సామర్థ్యంతో నిర్మించింది. కలుషిత వ్యర్థ జలాలను సంపూర్ణంగా శుద్ధి చేసేందుకు ఒక సమగ్రమైన పరిషారాన్ని సిద్ధం చేసిన జీహెచ్‌ఎంసీ, 2020లో సుమారు రూ.250 కోట్లతో జవహర్‌నగర్ డంప్ యార్డులో వ్యర్థ జలాల ట్రీట్‌మెంట్, మలారం చెరువుతో పాటు కృత్రిమ నీటి గుంటల రిస్టోరేషన్, శుద్ధి కార్యక్రమాన్ని రాంకీ సంస్థ చేపట్టింది. జవహర్‌నగర్ ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇప్పటికే వ్యర్థాల నిర్వహణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న జీహెచ్‌ఎంసీ, తాజాగా కొన్నేండ్లుగా పేరుకుపోయిన లిక్విడ్ వేస్ట్ (లీచెట్) శుద్ధి చేసే ప్రయత్నాల్లో విజయం సాధించబోతున్నది. ఈ మేరకు జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రాంగణంలో కాలుష్య కారక వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను రూ. 250 కోట్లతో రాంకీ సంస్థ రెండు ఎంఎల్‌డీల సామర్థ్యంతో నిర్మించింది.



## వైద్య ఖర్చులు పెరగడం ఆందోళనకరం

- లాభార్జనే ధ్యేయం కారాదు
- స్టార్టప్ ఛాలెంజ్ ఫినాలె-2023లో కెటిఆర్

హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు): అత్యధిక జనాభా ఉన్న మన దేశంలో వైద్య ఖర్చులు భారీగా పెరిగి పోతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపార కోణంలో ఇది మంచి అవకాశమే అయినప్పటికీ కేవలం లాభాల కోసమే పని చేయొద్దని సూచించారు. హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి హాస్పిటల్‌లో నిర్వహించిన స్టార్టప్ ఛాలెంజ్ ఫినాలె-2023 కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారత్‌లో వ్యవస్థాపకులుగా మారడం అంత సులువు కాదు. వ్యాపారవేత్తలకు కావాల్సిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.

మిగతా... 2లో



పేపర్ లీకేజీ కేసులో....

## సిట్టింగ్ జడ్జి దర్యాప్తు..!

కాదంటే సిబిఐకి అప్పగించాల్సిందే

- సిట్ దర్యాప్తుతో ఒరిగేదేమీ లేదు
- వరంగల్ మార్చ్‌లో బండి సంజయ్ డిమాండ్
- జిల్లాల్లో కూడా నిరుద్యోగ మార్చ్‌లు నిర్వహిస్తామని ప్రకటన

వరంగల్,ఏప్రిల్15(ప్రజా మంటలు): పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీలో సిట్ విచారణతో లాభం లేదని...సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ చేయించాలని లేదా సిబిఐ విచారణకు

మిగతా... 2లో



## మద్యం పాలసీ పేరుతో వేధింపులు

- మోడీకి వేయికోట్లు ఇచ్చిమంటే కేసు పెడతారా
- కేజ్రీవాల్‌పైనే అవినీతి ఆరోపణలు చేస్తారా
- పేర్లు చెప్పాలని అరెస్టయిన వారిపై ఒత్తిళ్లు
- కేందరం తీరుపై మండిపడ్డ ఆప్ నేత కేజ్రీవాల్
- కేంద్రం తీరును ఎండగట్టిన కపిల్ సిబల్

న్యూఢిల్లీ,ఏప్రిల్15(ప్రజా మంటలు): అవినీతికి వ్యతిరేకంగా అసెంబ్లీలో మాట్లాడినప్పుడే సీబీఐ సమన్లు పంపుతుందనే విషయం తనకు తెలుసునని



ఢిల్లీ ముఖ్య మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శనివారంనాడు అన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీపై సీబీఐ సమన్లు పంపిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ



దర్యాప్తునకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలు కోర్టులో తమపై అబద్ధాలు చెబుతున్నాయని ఆరోపించారు. అరెస్టు చేసిన వ్యక్తులను చిత్రహింసలు పెడుతూ, వారిపై ఒత్తిడి పెంచడం ద్వారా తమను ఇరుకునపెట్టేందుకు చూస్తున్నాయని అన్నారు. మద్యం విధానంలో మనీష్ సిసిడియాపై సీబీఐ తప్పుడు ఆరోపణలు చేసిందని, అబద్ధపు స్టేట్‌మెంట్లు ఇవ్వాలంటూ సాక్షులను చితక బాదుతున్నారని, అవినీతి నిర్మూలించే గొప్ప విధానం ఇదే కావచ్చునని ఆయన విమర్శలు గుప్పించారు. అసలు లిక్కర్ స్కామే లేదని

మిగతా... 2లో

## గవర్నర్ల తీరు అప్రజాస్వామికం

- రాష్ట్రాలపై పెత్తనం చేయిస్తున్న కేంద్రం
- తమిళనాడు సిఎంకు మద్దతుగా కేజ్రీవాల్ లేఖ
- కేజ్రీకి మద్దతు తెలిపిన బీహార్ సిఎం


న్యూఢిల్లీ,ఏప్రిల్15(ప్రజా మంటలు): తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి తీరుపై మండిపడుతూ..సిఎం స్టాలిన్‌కు ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ మద్దతు తెలిపారు. కేజ్రీవాల్ శనివారం తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ కు ఓ లేఖ రాశారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, రాష్ట్ర ప్రభుత్వం మధ్య



వివాదంలో స్టాలిన్‌కు మద్దతు ప్రకటిస్తూ కేజ్రీవాల్ ఈ లేఖను రాశారు. భారత దేశ ప్రజాస్వామ్యంపై ప్రతి రోజూ దాడులు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీబీఐ ఎదుట హాజరు కాబోయే ముందు కేజ్రీవాల్ ఈ లేఖను రాయడం విశేషం. ఢిల్లీ మద్యం విధానం కేసు లో దర్యాప్తు సంస్థలు దూకుడు పెంచడంతో బీజేపీయేతర పక్షాలన్నీ ఏకమవుతున్నాయి. ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కు సీబీఐ సమన్లను జారీ చేయడంపై అనేక మంది నేతలు స్పందిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలను అణచి వేసేందుకే బీజేపీ ఈ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని ఆరోపిస్తున్నారు.

మిగతా... 2లో

## ప్రజానాడి




## ఢిల్లీ సిఎంకు సిబిఐ నోటీసులు

- 17న అసెంబ్లీలోలో ప్రత్యేకంగా చర్చించేందుకు నిర్ణయం




న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ప్రజా మంటలు): మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్య మంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సీబీఐ సమన్లు పంప దంతో ఒక్కసారిగా ఢిల్లీ రాజకీ యాలు వేడెక్కాయి. 16వ తేదీ ఆదివారం 11 గంటల సమయంలో దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాలని సీబీఐ సమన్లు పంపగా, ఈ అంశంపై చర్చించేందుకు సోమవారంనాడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి 'ఆప్' సర్కార్ పిలుపునిచ్చింది. మద్యం పాలసీ కేసులో ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఇప్పటికే జైలులో ఉండగా, తప్పుడు కేసులతో సీబీఐ, ఈడీలను ఒక ఆయుధంగా కేంద్రం వాడుకుంటోందని ఆప్ ఆరోపణలు

మిగతా... 2లో



నిజామాబాద్

## ఆస్పత్రిలో దారుణం

- రోగిని కాళ్లు పట్టుకుని లెక్కెళ్లిన ఘటన
- స్ట్రెచర్ లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితి
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఘటన
- అదంతా అబద్ధమన్న ఆస్పత్రి సూపరెన్టెంట్
- ఘటనపై విచారణకు ఆదేశించిన మంత్రి హరీష్ రావు

నిజామాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు): నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుష సంఘటన చోటు చేసుకుంది. అనారోగ్య సమస్యతో నడవలేని స్థితిలో ఓ రోగి ఆసుపత్రికి వచ్చాడు. స్ట్రెచర్ అందుబాటులో లేదని ఆసుపత్రి సిబ్బంది చెప్పడంతో బయట నుంచి రెండో అంతస్థు లిఫ్ట్ వరకు రోగి బంధువులే అతని కాళ్లు పట్టుకుని ఈడ్చుకుంటూ వైద్యుని దగ్గరకు లాక్కెళ్లారు. రోగి కాళ్లు పట్టుకుని లాక్కెళుతున్నా అక్కడి వైద్య సిబ్బంది కూడా పట్టించుకోలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. గత మార్చి 31న ఈ సంఘటన చోటు చేసుకోగా ప్రస్తుతం దీనికి

మిగతా... 2లో

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

- బడ్జెట్‌లో పథకానికి 30వేల కోట్ల కోత
- కేంద్రానికి పోస్ట్ కార్డు రాసిన మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు): ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు ఆరోపించారు. గత ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి 30 వేల కోట్ల కోత విధించారని చెప్పారు. దాంతో ఉపాధి హామీ కూలీలకు పని దినాలు తగ్గాయన్నారు.వ్యవసాయ కూలీకి రోజుకు 257 రూపాయలు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ, ఒక్కో కూలికి వంద రూపాయలకు మించడం లేదని మంత్రి విమర్శించారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండటం లేదని, టెంటు, మంచి నీళ్లు, గడ్డపారలు, పారలు, తట్టలు వంటివి అందించడం లేదని చెప్పారు. ఉపాధి హామీ పథకంపై నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చేపట్టిన పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌లో మంత్రి హరీష్ రావు కేంద్రానికి పోస్టుకార్డు రాశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో పోస్టు కార్డు రాసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కనీస వేతన చట్టం ప్రకారం 8 గంటలు పనిచేసిన కూలీకి 480 రూపాయలు ఇవ్వాలని ఉన్నప్పటికీ, ఉపాధి హామీ కూలీలకు మాత్రం కనీస కూలీ గిట్టడం



లేదని వాపోయారు. ఆన్‌లైన్ పద్ధతివల్ల గ్రామీణ అటవీ ప్రాంతాల్లోని ప్రజలకు నష్టం జరుగుతున్నదన్నారు. వారికి సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పాటించలేకపోతున్నారని చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని, సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కూలీలుగా వారే ఉంటున్నారని, కాబట్టి వ్యవసాయాన్ని ఉపాధి

మిగతా... 2లో

# ఎమ్మెల్యే సంజయ్‌కు చిందు కులస్తుల వినతి.

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణానికి చెందిన చిందు కులానికి చెందిన యక్షగాన కళాకారులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి దళితులలో అత్యంత వెనుకబడిన చిందుకులస్తులకు



ఎలాంటి జీవనోపాధి లేదని, అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నామని ప్రభుత్వ పథకాలలో న్యాయం చేయాలని, సంఘ భవనానికి నిదులు కేటాయించాలని,డబల్ బెడ్ రూం ఇండ్ల లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాలే శంకర్,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు,చిందు కుల సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జెడ్పి చైర్మెన్ దంపతులు.

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజా మంటలు) :** ధరూర్ క్యాంప్ లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో విషు పూజ మహోత్సవం పురస్కరించుకుని జగిత్యాల జిల్లా జెడ్పి



చైర్పర్సన్ దావ వసంత సురేశ్ దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెడ్పి చైర్మన్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందచేసి స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వధించిన ఆలయ అర్చకులు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు ,బీ.ఆర్.ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్ రావు నాయకులు బండారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన రవీంద్ర ప్లే స్కూల్ రంగోత్సవ్ - 2K23 సంబరాలు.

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణం లోని రవీంద్ర ప్లే స్కూల్ లో ఘనంగా " రంగోత్సవ్ 2K23 " పేరిట వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులకు కనువిందు



చేసాయి. శివ తాండవం, ఆంజనేయ స్వామి కథ పౌరాణిక రూపం, విద్యార్థుల తల్లులు చేసిన నృత్యాలు, నర్సరీ పిల్లలు అమ్మ పాట పైన వారి తల్లులతో చేసిన నృత్యాలు అలరించాయి. ముఖ్యంగా " తండ్రి - తనయులు" అనుబంధం పైన చేసిన నాటిక చూపరులను ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుమన్ రావు, శ్రీధర్ రావు, హరిచరన్ రావు, మౌనిక- హరి చరణ్ రావు,రజిత,కిషన్, రాజు తో పాటు పోషకులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా. సంజయ్‌కు మంజునాథ గ్రామైక్య సంఘం సభ్యుల వినతి.

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజా మంటలు) :** జగిత్యాల రూరల్ మండల అంతర్గం గ్రామానికి చెందినశ్రీ మంజునాథ గ్రామైక్య సంఘం సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే



డాక్టర్ సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించడానికి అనుమతి ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి నారాయణ, రైతు బంధు సమితి మండల కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి,తొలిప్రేమ శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నూకపల్లి డబల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణములో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నుకాపల్లి డబల్ బెడ్ రూం ఇండ్లను,నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మేల్యే డా. సంజయ్ కుమార్. అనంతరం జగిత్యాల లో నిర్మిస్తున్న అమర వీరుల స్తుపాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణ నిరుపేద ప్రజల చిరకాల కోరిక డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణమని ముఖ్యమంత్రి,కవిత,కెటిఆర్,ప్రశాంత్ రెడ్డి, ఈశ్వర్ ల సహకారం తో నూక పల్లి లోని 4520 డబుల్ బెడ్రూం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు, దళిత, మైనార్టీ వర్గాలకు,బిసి లకు,ఇతరులకు అతి త్వరలోనే ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఏలాంటి పైరవీలు లేకుండా పారదర్శకంగాత్వరలోనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డా.నరేష్, డిఈ లు మిలింద్,రాజేశ్వర్,పట్టణ యూత్ అధ్యక్షులు గిరి,వంశీ బాబు,అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కన్నారపు శివశంకర్‌కు 'దళిత రత్న'

**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ రవింద్ర భారతి కళా వేదిక ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే 'దళిత రత్న' రాష్ట్ర స్థాయి అవార్డును తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ అందుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్-డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల వర్కింగ్ కమిటీ చైర్మెన్ మేడి పాపయ్య, కన్వీనర్ జేరుపోతుల పరశురాములు చేతుల మీదుగా శివశంకర్ అవార్డు తీసుకున్నారు. అంబేద్కర్ సూచించిన బోధించు, సమీకరించు, పోరాడు అన్న ఆలోచన విధానంను ముందుకు తీసుకుపోవడంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాలలోని అణగారిన ప్రజలను తమ హక్కుల కోసం చైతన్యవంతుల్నీ చేయడంలో శివశంకర్ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం శివశంకర్ కు దళిత రత్న అవార్డునిచ్చి ఘనంగా సన్మానించింది. దళిత జాతి చైతన్యానికి శివశంకర్ చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం 2019లో 'దళిత యువరత్న, 2020లో 'అంబేద్కర్ సేవా పురస్కారం', పత్రికా రంగంలో సమాజానికి చేస్తున్న సేవను గుర్తించి అభినందన సోషల్ సర్వీస్ సొసైటీ 2023 జనవరిలో 'సేవారత్న', భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం'దళిత రత్న' రాష్ట్ర స్థాయి అవార్డును ఇచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా 'దళిత రత్న' అవార్డు గ్రహీత శివశంకర్ ను దళిత, గిరిజన, బహుజన



ప్రజా సంఘాల నాయకులు, మేధావులతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, లీడర్లు ప్రత్యేకంగా అభినందించారు. తనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించిన ప్రతిఒకరికి శివశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

- కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ ఆడిటోరియంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పండుగ అనేది మానవాళికి హితాన్ని భోదిస్తుందని,ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి ఆందిస్తుందన్నారు. దివ్య ఖురాన్ గ్రంధం ఈ మాసం లోనే ఆవిర్భావించిందన్నారు. మన జాతీయతకు, సంస్కృతి కి దోహదం చేస్తున్న అన్ని పండుగలు జాతీయ సమైక్యత కు ప్రతిభింబమన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, టీ ఎన్జీవోలు కలిసి మెలసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మత సామరస్యంగా మెలిగినట్లే అన్ని మతాల పండుగల్లో జాతీయ సమైక్యత చూపాలన్నారు. రెవెన్యూ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. వకీల్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యు బి.ఎస్. లత, అడిషనల్ కలెక్టర్ ఎల్.బి. మంద మకరంద్, ఆర్డీవోలు మాధురి, వినోద్ కుమార్, రెవెన్యూ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. వకీల్, టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ట్రెసా జిల్లా కార్యదర్శి కృష్ణ, టీ ఎన్జీవో కార్యదర్శి




నాగేందర్, కలెక్టర్ కార్యాలయం ఏ.ఓ. నాగార్జున, రెవెన్యూ, టీ ఎన్జీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ చైతన్య యాత్ర పోస్టర్ విడుదల

**సైదాపూర్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** కేంద్రంలో భారత కమ్యూనిస్ట్ పార్టీలి మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్ర పోస్టర్ ను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు ఆవిష్కరించారు. బత్తుల బాబు మాట్లాడుతూ.... బీజేపీ ని గద్దె దించండి దేశాన్ని రక్షించండి. అనే నీనాదమ్ తో యాత్ర కొనసాగుతుంది అని బత్తుల బాబు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నా సైదాపూరు మండలానికి చేరుకుంటుంది . సాయంత్రం బహిరంగా సభ ఉంటుంది,అని బాబు తెలియజేశారు. ఈ నాయకత్వానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెన్నం సురేష్ తో పాటు మరో 200 మంది ఎర్ర చొక్కా కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఒడ్డునాల



వెంకటేష్ , కోర్మి పద్మయ్య, జడల రాజేశం, భాషవేణి శ్రీనివాస్, నలువాల రవి, కొమ్ముల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఇంటర్, డిగ్రీ అర్హత పరీక్షలకై దరఖాస్తు చేసుకోండి

- నేడే చివరి రోజు
- ఆర్.సి.వో. గౌతమ్ కుమార్ రెడ్డి

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతి బాపూలే బి.సి. గురుకుల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు నిర్వహించే ఆర్.జే.సి. సెట్, ఆర్డిసి సెట్ కు ఏప్రిల్ 16 చివరి తేదీ అని ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్.సి.వో గౌతమ్ కుమార్ రెడ్డి కోరారు. శనివారం జగిత్యాల లో విడుదల చేసిన ప్రకటనలో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ సెట్, రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ సెట్ ద్వారా విద్యార్థులకు కళాశాలలో 2022-23 ప్రవేశాలు కల్పిస్తారని జూనియర్ కళాశాలలో చేరేందుకు. పదో తరగతి అర్హత కాగా డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఏప్రిల్ 16 చివరి తేదీ అని %ష్ట్రజూ/ఎయిజ్ఎఎషతీవఅర్.వశ్రీఖఅస్త్రుఖఋ.స్త్రశీజ.ఱఅ% వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న విద్య అని ఆసక్తి కలిగిన విద్యార్థులు సత్వరమే దరఖాస్తు చేసుకోవాలని ఆర్.సి.వో గౌతమ్ కుమార్ రెడ్డి కోరారు.

## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డా. సంజయ్.

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో 1944 సంవత్సరం లో ఏప్రిల్ 14 న అగ్నిప్రమాదం లో 66 మంది ఫైర్ మెన్ లు మరణించగా వారి జ్ఞాపకార్థం నేషనల్ ఫైర్ సర్వీస్ డే సందర్భంగా ఏప్రిల్ 14 నుండి 20 తేది వరకు జరిగే



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,అగ్నిమాపక అధికారి కొమురయ్య,కౌన్సిలర్లు ముస్కు నారాయణరెడ్డి, చుక్క నవీన్,కమిషనర్ డా.నరేష్, డి ఈ రాజేశ్వర్,కార్మిక విభాగం అధ్యక్షులు తొలిప్రేమ శ్రీనివాస్,మతీన్,వంశీ బాబు,అజార్,లక్ష్మి నారాయణ, దయాల మల్లారెడ్డి,నాయకులు ఆడువల లక్ష్మణ్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న సోమశేఖర్ రెడ్డి


**గుంతకల్లు ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** బళ్లారి ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి ఎమ్మెల్యేగా నామినేషన్ వేస్తున్న సందర్భంగా నామినేషన్ పత్రాల్ని కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దగ్గర ఉంచి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. దర్శనానికి బళ్లారి ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి



దర్శనానికి విచ్చేసిన సందర్భంగా వారికి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఆలయ అర్చకులు వేద పండితులు దేవాలయ అధికారులు వారికి ఆశీర్వచనాలు అందించి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశ్వర్లు ఆలయ చైర్మన్ సుగుణమ్మ నాగేశ్వర్ రెడ్డి ఆలయ పూర్వ ధర్మకర్త వనగొంది విజయలక్ష్మి, వనగొంది కిరణ్, బిజెపి జిల్లా బిల్డింగ్ సెల్ కన్వీనర్ గుర్రం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నటుడు పాలసాని వేణుకు కళాశ్రీ ఆత్మీయ సత్కారం

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** ప్రముఖ రంగస్థల నటుడు, సినీ క్యారెక్టర్ నటుడు పొలసాని వేణుగోపాల్ రావు జగిత్యాల ధరూర్ క్యాంప్ లో విరంచి వర్మ దర్శకత్వంలో టైగర్ జితేందర్ రెడ్డి బయోపిక్ సినిమా షూటింగ్ సందర్భంగా జగిత్యాలకు విచ్చేసిన సందర్భంగా



పట్టణానికి చెందిన కళాశ్రీ ఆర్ట్ థియేటర్స్ అధినేత గుండేటి రాజు, బిజెపి రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్ రెడ్డి, భారత్ సురక్ష సమితి అధ్యక్షుడు ఏసిఎస్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా శాలువ, బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా నటుడు వేణుగోపాల్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా సినిమా షూటింగ్ లకు అనువైన ప్రదేశాలు ఉన్నాయని, ఇక్కడి ప్రజలు సినిమా నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆశాభావాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో భూసారపు శ్రీనివాస్ గౌడ్, పాత్రికేయులు ఎల్లాల రాజేందర్ రెడ్డి, బెజ్జంకి సంపూర్ణ చారి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కె. గంగారామ్ డిఈ, టెక్నికల్‌గా, ఎస్ఈ ఆఫీస్, విద్యుత్ ప్రగతి భవన్ లో జాయిన్ కాగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన సర్కిల్ ఆఫీస్ సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది

# రాజకీయ ప్రత్యామ్నాయం అసాధ్యమేమీ కాదు!



దేశంలో రాజకీయ శక్తుల పునరేకీకరణకు అవకాశాలు ఉన్నాయి. నితీశ్ కుమార్ తాజాగా చేపట్టిన చర్చలు.. అంతకుముందు నుంచే తెలంగాణ సిఎం కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే..ప్రత్యామ్నాయం అసాధ్య మేమీ కాదు. అయితే అందుకు చిత్తశుద్దతో పాటు..నిస్వార్థం కూడా అవసరం. జనతాపార్టీ సందర్భంలో జయప్రకాశ్ నారాయణ్. ఎన్టీఆర్ కూడా ఇలాగే నిస్వార్థంగా పని చేశారు. ఇప్పుడా పరిస్థితులు మళ్లీ దేశం ముందున్నాయి. గత పదేళ్ల కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఎ పాలనతో విసిగెత్తిన ప్రజలు బిజెపికి పట్టం కడితే...అందుకు భిన్నంగా ఇప్పుడు 9 ఏళ్ల మోడీ పాలన సాగుతోంది. మోడీ పాలనతో ప్రజలు విసుగెత్తి ఉన్నారు. కర్నాటకలో బిజెపి పాలనకన్నా కాంగ్రెసే నయం అన్న భావనలో ప్రజలు ఉన్నారు. గతమే బెటర్ అన్న ధోరణి ప్రజల్లో బలంగా నాటుకుంది. అలాగని గతంలో కాంగ్రెస్ మంచి చేసిందన్న భావన కాదు. రైతుల ఆందోళనలు, లిఖింపూర్ ఘటనలు, పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరల పెరుగుదల గమనిస్తే ఈ భావన కలుగుతోంది. అంతేగాకుండా ప్రజలకు అందుబాటులో లేని ప్రభుత్వంగా మోడీ పేరు తెచ్చుకు న్నారు. ఆయన సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. మంత్రులకు అధికారం లేదు. బిజెపి తను చేసిన ఘనకార్యాలను చాటే బదులు ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ కుటిల రాజకీయాలను వంటిబట్టిం చుకుంది. దీంతో నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దాదాపుగా అన్ని పార్టీలూ ఏకం అవుతున్నాయి. కాంగ్రెస్, నితీశ్ కుమార్‌లో రంగంలోకి దిగారు. తెలంగాణలో కెసిఆర్ కూడా జాతీయ రాజకీయాల్లో పావులు కదుపుతున్నారు. అన్ని పార్టీలు ఏకమైతే మోడీని దించడం పెద్ద కష్టమేమీ కాకవపోవచ్చు. అయితే ఈ పార్టీల్లో ఐక్యతే ఎండమావిగామారింది. అధి కారంతో కూడిన అహంకారం తలకెక్కిన బిజెపి నేతలు.. అవినీతికి దూరంగా ఏమీ లేరు. కానీ ఎదుటివారి అవినీతినే వారు బూచిగా చూపిస్తున్నారు. వారికి వాస్తవాలు కనిపించవనడానికి దేశ సమస్యల పరిష్కారంలో వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడమే నిదర్శనం. ఎపికి ప్రత్యేక హోదా హామీని అమలుచేయలేక పోవడంతో ఎపిలో ప్రజలు బిజెపి అంటేనే మండిపడుతున్నారు. ప్యాకేజీ అమలు కాకపోవడంతో పరిస్థితులు తిరగబడ్డాయి. ప్రత్యేక హోదా అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకోని పార్టీలకు మనుగడ ఉండదని బిజెపి నేతలు భావించడం లేదు. తమకు భారతీయ జనతా పార్టీ అన్యాయం చేస్తున్నదని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు బలంగా నమ్ముతున్నారు. దీనికంతటికీ కారణం నరేంద్ర మోదీ పాలనాతీరే నిదర్శ నంగా చూడాలి. దేశంలో పరిస్థితులు నానాటికి దిగజారు తున్నాయి. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాహుల్‌పై సత్వర చర్యలతో ప్రజల్లోనూ ఆలోచన పెరిగింది. దీంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం రెట్టింపయ్యింది. సమస్యలపై పోరాటంలో ప్రాంతీయ పార్టీల నాయకులే కాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా చేయి కలిపింది. చెల్లాచెదురుగా ఉన్న ప్రతిపక్షాలను ఏకం కావడం అన్నది మోడీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రచారం చేయడానికి పనికివస్తోంది. మోడీ ప్రభుత్వం పట్ల ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే నని, దానితో పాటు విభజన సమయం లో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని ఇప్పటికీ అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి దేశాన్ని అడ్డగోలుగా చీల్చేస్తోందని రాహుల్ ధ్వజమెత్తారు. ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితుల్లో దేశం మొత్తాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రాహుల్ ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల అభివద్ధి, ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పనిచేస్తోందని హామీ ఇచ్చారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వృద్ధి తిరోగమనంలో పడిందని ఎన్నికలకు ముందు మోడీ విపరీతంగా ప్రచారం చేశారు. అయితే మోడీ పాలన అంతా ప్రచార ఆర్భాటంగా ఉందని తాజా పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అందుకే వ్యవసాయం, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, దేశ భద్రత, ఆర్థిక, పారిశ్రామిక విధానం, విదేశీ వ్యవహారాలు, కుంభ కోణాలు, అవినీతిపై ప్రజల్లో విపరీతమైన చర్చ జరుగుతోంది. గత పదేళ్ల కాంగ్రెస్ పాపాలను ప్రజలు మరచిపోయారు. ఎందుకంటే బిజెపి పాలన ప్రజలకు భారంగా మారింది. నోట్ల రద్దు, జిఎస్టీ,పెట్రోధరలు, గ్యాస్ ధరలు తదితర అంశాల కారణంగా ప్రజలపై కోలుకోలేని ఆర్థిక భారం పడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. దేశంలో నిరుద్యోగం తాండ విస్తోంది.

దీంతో పాటు అనేక సమస్యలు ప్రజలను వెన్నాడు తున్నాయి. ఈ దశలో ప్రజలకు మళ్లీ తృతీయ ప్రత్యామ్నాయం ఆశగా కనిపిస్తోంది. సిఎం కెసిఆర్ కూడా కేంద్రం తీరును ఇటీవల గట్టిగానే తూర్పారా బట్టారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న దృష్ట్యా పరిస్థితులు బిజెపికి వ్యతిరేకంగా మారుతున్నాయి. ఈ క్రమంలో విపక్షాలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు రావాలి. ఎన్నికల తరవాతే పొత్తు అంటున్న సిపిఎం పిడివాదాన్ని వీడాలి. పొత్తులకన్నా ముందు దేశ ప్రజలకు విశ్వాసం కల్పించే రాజకీయ పార్టీ కావాలి. ఉమ్మడి ఎజెండాతో ప్రజలకు ముందుకు వెళ్లగలికే కూటమి కావాలి. విపక్షాలు కలసిన ప్రతిసారీ ప్రధాని ఎవరన్నా ఆలోచన సరికాదు. ప్రత్యామ్నాయం ఎలా అన్నద సంకల్పంతో సాగాలి.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## నిద్ర

"శివయ్యా! ఏంటి నీ కళ్ళు ఎర్రబడ్డాయి "అంటూ ప్రశ్నించాడు పక్క వీధి పరంధామయ్య.

"ఎప్పటినుండో మంచి ఇల్లు కట్టుకోవాలని అనుకుంటున్నాను కానీ కుదరడం లేదయ్యా, రాత్రి నిద్ర కూడా పడతం లేదయ్యా" అంటూ కళ్ళు



నులుముకున్నాడు శివయ్య.

"ప్రయత్నిస్తే ఎందుకు కట్టలేవు బ్రహ్మాండమైన ఇల్లు కట్ట గలవు " అన్నాడు పరంధామయ్య.

"అదేందయ్యా ఇల్లు కట్టి చూడు అని మన పెద్దోళ్ళు ఊరకే అన్నారా? నాకు ఇష్టమైనట్లుగా ఇల్లు కట్టుకోవాలంటే మాలాంటి మధ్యతరగతి వాళ్ళకి కష్టమే మరి, అంతా డబ్బుతో అయ్యే పని" తల గోక్కుంటూ అన్నాడు శివయ్య.

"డబ్బు దేముందయ్యా శివయ్య అడవిలో నిప్పు!, ఊరిలో అప్పు! చేయడం మామూలే కదా అప్పు చేసి, ఏం చక్క ఇల్లు కట్టేసుకోవచ్చు కదా! "అని ఉచిత సలహా చెప్పాడు పరంధామయ్య.

పరంధామయ్య ఉచిత సలహాతో వాళ్ల దగ్గర, వీళ్ళ దగ్గర అప్పు చేసి మరీ కొంతకాలానికి మంచి ఇల్లు కట్టేసుకున్నాడు. శివయ్య చిరకాలం కోరిక నెరవేర్చుకున్నాడు.

ఓ రోజు శివయ్యను,"ఎట్టకేలకు నీకు ఇష్టమైన మోడల్‌లో ఇల్లు కట్టేసుకున్నావ్! ఇప్పుడు సంతోషమేనా !?" అని అడిగాడు పరంధామయ్య.

"ఏం సంతోషం అయ్యా వాళ్ల, వీళ్ల బాకీలు ఎలా తీర్చాలని!? నాక సలు నిద్ర కూడా పడతం లేదంటే నమ్ము" అంటూ ఆవలించాడు శివయ్య.

– అమ్మిన వెంకట అమ్మిరాజు

పేరూరు -ములుగు (జిల్లా), 9440708656

## విశ్వాసం

అనగనగా ఒక ఊరిలో బంగారయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి ఒక కొడుకు ఉన్నాడు. అతని పేరు రాజు. బంగారయ్యకు ఒక పెంపుడు కుక్క కూడా ఉండేది. దాని పేరు జూలీ. బంగారయ్యకు మూగజీవులంటే ప్రాణం. వాటిని ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. రాజుకు మాత్రం జంతువులు అంటే ఇష్టం ఉండేది కాదు. జూలీ పట్ల అసహ్యంతో ఉండేవాడు. అలా ఉండకూడదని జంతువుల పట్ల దయ కలిగి ఉండాలని, తండ్రి ఎంత చెప్పినా రాజు వినిపించుకునేవాడు కాదు.



ఒక రోజు ఆదివారం బడి లేక పోవడం వలన బంగారయ్యతో రాజు కూడా పొలం దగ్గరకు వెళ్తాడు. వారితో పాటు జూలీ కుక్క కూడా పొలం వద్దకు వెళ్తుంది. బంగారయ్య పొలం పనిలో ఉండగా రాజు ఆడు కోవడానికి కొంచెం దూరం వెళ్తాడు. ఆటలోపడి రాజు చూసుకోకుండా పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడిపోతాడు.

అది గమనించిన పెంపుడు కుక్క జూలీ బంగారయ్య వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్లి అతడిని బావి దగ్గరకు లాగుకు వచ్చింది. బంగారయ్య బావిలోకి తొంగి చూడగా మునిగిపోతున్న తన కొడుకు రాజు కనిపించాడు. వెంటనే అతడు బావిలోకి దూకి, రాజును భుజాల పైకి ఎక్కించుకొని బావిలోని పైపు పట్టుకొని పైకి వస్తాడు. జూలీ మొరగడంతో, పరిసరాలలో ఉన్న రైతులు బావి దగ్గరకు వస్తారు. వారు రాజు పొట్టపై ఒత్తి మింగిన నీటిని బయటికి పంపిస్తారు. తర్వాత హాస్పిటల్ తీసుకువెళ్తారు. రాజు క్షేమంగా బయటపడ్డాడు.

"నీవు ఎప్పుడు అసహ్యించుకునే జూలీ వలన నీకు ప్రాణాలు నిలిచాయి" అని బంగారయ్య రాజుతో అంటాడు. తన తండ్రి రోజు అన్నం పెట్టిన విశ్వాసంతో జూలీ నన్ను కాపాడింది. ఈ రోజు జూలీ లేక పోతే నేను ఉండేవాడిని కాదు అని అనుకుంటాడు. అప్పటి నుండి రాజు కూడా జూలీ పట్ల మరియు ఇతర మూగ జీవల పట్ల ప్రేమగా ఉండసాగాడు. వాటికి ఆహారం పెట్టి ఆకలి తీర్చేవాడు. జంతువుల పట్ల రాజు అభిప్రాయం మారినందుకు బంగారయ్య సంతోషించాడు.

– కె. శివాంజలి, 8వ తరగతి,

జి.ప.ఉ.పా. నర్సింహుల పల్లి, పెద్దపల్లి జిల్లా.

# వ్యక్తిగత మరుగదొడ్లపై పెరుగుతున్న చైతన్యం

స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం. ప్రజల్లో నిర్లిప్తత తొలగాలి. పరిశుభ్రత పాటించకపోతే వ్యక్తిగతంగా తమకు, తద్వారా సమాజానికి చేటు జరుగుతుందన్న విషయం ప్రచారం చేయాలి. ప్రజలను నిరంతర చైతన్యం చేయడం ద్వారానే




సంపూర్ణ స్వచ్ఛత సాధించగలమని గుర్తించాలి. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు' ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి మూడేళ్లు గడిచాయి. గ్రామసీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలంగాణలో పలు జిల్లాల్ని ఓడీఎఫ్‌లుగా ప్రకటించింది. వార్డు కమిటీలు, స్వయంసహాయక సంఘాలు, పట్టణ సమాఖ్యల ఉమ్మడి కృషితో అనేక గ్రామాలు అనతికాలంలోనే లక్ష్యం సాధించాయి. కూలిపనులు చేసి సంపాదించిన సొమ్ముతో మరుగుదొడ్లు నిర్మించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు వాసులు ఇతర ప్రాంతాలవారికి ఆదర్శ ప్రాయులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం వివిధ విభాగాలవారితో ప్రచార బృందాల్ని ఏర్పాటుచేసి, మారుమూల గ్రామాలకీ పంపించీ అవగాహన పెంచేందుకు కృషిచేస్తోంది. ఏపీలోని అనేక గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాథమ్యంగా ప్రకటించింది. ప్రభుత్వాల, ప్రజల ఆలోచనా ధోరణిని బట్టే శౌచాలయ నిర్మాణ పక్రియ ముందుకు సాగుతుంది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది.అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు తీసుకోవాలి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పలి. అందువల్లనే మనదేశంలో అనారోగ్యకర వాతావారణం ఎక్కువే. అలాగే వ్యాధుల సంక్రమణ, అంటువ్యాధుల వ్యాప్తి కూడా ఎక్కువే. స్వచ్ఛ భారత్ ప్రకటించిన తరవాత దేశంలో కొంత మార్పు గోచరిస్తోంది. ప్రధానంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం తొలిసారిగా ఆర్థిక చేయూత ఇవ్వడం ద్వారా గ్రామాల్లో మార్పు కనిపిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో జోరుగా దీనిపై శ్రద్ధ పెడుతున్నారు. వ్యక్తిగత మరగుదొడ్లు నిర్మించుకోకుంటే ప్రభుత్వ పథకాల అమలు నిలిపి వేస్తామని హెచ్చరించడం మొదలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలతో ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం వస్తోంది. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు, పొలం ప్రాంతాలు, గ్రామ శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాల కృత్యాలు హానికరంగా పరిణమిస్తున్నాయి. అటువంటి అనారోగ్యకర వాతావరణంలో సగటు మనుషులకు వ్యక్తిగత మరుగుదొడ్లు ఎంత అవసరమో వేరే చెప్పనవసరం లేదు. ఈ అవసరాన్ని గుర్తించారు కాబట్టే, కేరళలో దశాబ్దాల క్రితమే 'ఇంటింటికీ సెప్టిక్ లెట్రిన్' అనేది ఒక విధంగా ఉద్యమ స్థాయిలో సాగింది. అదే స్ఫూర్తి ఇతర రాష్ట్రాలకీ వ్యాపించాల్సి ఉంది. పారిశుద్ధ్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది.

## చరమాంకంలో తెలుగు నాటక రంగం...

# నిర్లక్ష్యం చేస్తే కనుమరుగు ఖాయం

### ఏప్రిల్ 16...తెలుగు నాటకరంగ దినోత్సవం

19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపం చేశారు. తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు




నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది.

నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోద ప్రదేశమే కాదుబీ వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసు కోవచ్చు.

తెలుగు దేశంలో ఆధునిక నాటక రచన ప్రదర్శనలకు దారితీసిన వారు పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు ఆధునిక తెలుగు నాటక రచనా ప్రారంభ విషయాన ప్రథములు. కందు కూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీ యము". 'ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరిం చడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు.

ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన "రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980 వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది.

తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, "వేణీ సంహారము". తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాత్రోచిత భాష, అనుప్రాసయుక్తము ప్రాబంధికము అయిన శైలి ఆయన పాటించిన అంశాలు. పాటలు (టపాలు) పాడుట ఇతడు ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ఈ మూడు అంశాలు కాలక్రమంలో తెలుగు నాటక రంగం మీద ప్రాధాన్యం వహించాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వారు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులవారు 30 నాటకాలు రచించారు. అన్నీ స్వతంత్ర రచనలే. తన నాటకాలలో పాటలు ప్రవేశ పెట్టారు. పద్యాలను రాగయుక్తంగా పాడడం కూడా ప్రవేశ పెట్టారు. అయన "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య-పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో " వెంకట రాయశాస్త్రి రచించిన "ప్రతాపరుద్రీయం" బహుళ ఖ్యాతినొందింది.

1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాధ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. "ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలలో "కర్ణాటక రాజ్యనాశము" లేదా "రామరాజు చరిత్రము"నకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన తొలి నాటకం "నర్మదాపురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రభావం వల్ల నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం.

1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడి" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపుమాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఈ కాలంలో దువ్వూరి రామిరెడ్డి గారి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1937 నుంచి రేడియో నాటికలు, 1944-45 నుంచి రంగస్థల ఏకాంకికలు పుంఖాను పుంఖాలుగా వెలువడు తున్నాయి. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగంలో "ఫ్రీజ్" ప్రవేశించింది.

ఆ తరువాత లెక్కలేనన్ని ప్రయో గాలు ఆధునిక నాటకరంగాన్ని వరించాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది.

ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టములూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. నటులూ అంటే సినిమా నటులే అన్న ఒక అభిప్రాయం బలంగా నాటుకు పోయింది. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరు చెప్పి ఓ పది పదిహేను నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంతిండ్. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థలకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకు మంటూ అరి పోవడానికి సిద్ధంగా ఉన్న నాటకరంగం బతికి బట్ట కట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించక పోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగు కాక తప్పని స్థితి నెలకొంది.



-ఆర్కె సంగనభట్ల
9440595494




# టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసు

### ఇడి కస్టడీకి నిందితుల అప్పగింత

**హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు):** టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసులో నిందితులకు నాంపల్లి కోర్టు ఈడీ కస్టడీకి అనుమతి ఇచ్చింది. ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌ను కస్టడీకి అనుమతి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నాంపల్లి కోర్టు 2 రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతించింది. నిందితులను ఈ నెల 17, 18న చంచల్‌గూడ జైలులో ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారించనున్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సాయి లౌకిక్, సుష్మితను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కస్టడీలోని నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అరెస్ట్ చేసినట్లు సమాచారం. సుష్మిత కోసం రూ.6 లక్షలు పెట్టి.. ప్రవీణ్ నుంచి డీఏఓ పరీక్ష పేపర్‌ను సాయి లౌకిక్ కొనుగోలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో 17కు అరెస్ట్?ల సంఖ్య చేరింది. మరోవైపు టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. గ్రూప్–1 ప్రిలిమ్స్ మెరిట్ లిస్టును సేకరించిన సిట్.. 100కు పైగా మార్కులు సాధించిన 121 మందిని విడతల వారీగా విచారించి, వారి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకుంది. వారి సామర్థ్యం, ప్రతిభాపాటవాలను పరీక్షించేందుకు కొన్ని ప్రశ్నలను వారి ముందు పెట్టి, ఎంత సమయంలో సమాధానాలు రాస్తారు? అనే విషయాన్ని గుర్తించింది. అదే సమయంలో ఈ కేసులో నిందితులైన ప్రవీణ్, షమీమ్, రమేశ్, సురేశ్‌లతో వీరికి సంబంధాలున్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేసింది. అటు జగిత్యాల జిల్లా మల్యాలలో మెయిన్స్‌కు అర్హత సాధించిన 40 మంది అభ్యర్థులను విచారించిన సిట్.. ఓ నివేదికను సిద్ధం చేసింది. ఈ నెల 11న హైకోర్టుకు ఆ రిపోర్టును సీల్డ్‌కవర్‌లో అందజేయనుంది. మరోవైపు ఈ కేసులో 15 మంది అరెస్టయిన వారిలో చివరి ముగ్గురు నిందితులు ప్రశాంత్, తిరుపతయ్య, రాజేంద్రకుమార్‌ల పోలీసు కస్టడీ గురువారంతో ముగియడంతో, వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ ముగ్గురూ ఎంత మందికి ఏఈ ప్రశ్నపత్రాన్ని విక్రయించారు? అనే కోణంపై ఈ మూడ్రోజులూ ప్రశ్నించి, వాంగ్మూలాన్ని సేకరించినట్లు తెలిసింది.

# తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ దృష్టి

### రాష్ట్ర ఎన్నికల అధికారులతో బృందం చర్చలు

**హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు ఉండడంతో ఈసీ బృందం శనివారం హైదరాబాద్‌లో పర్యటించింది. డిప్యూటీ కమిషనర్ నితీష్ వ్యాస్ నేతృత్వంలోని ఈసీ బృందం.... తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్, ఇతర అధికారులతో సమావేశమైంది. ఎన్నికల కసరత్తుపై రాష్ట్ర ఎన్నికల అధికారు లకు కీలక సూచనలు చేసింది.
రాష్ట్రంలో ఓటర్ల జాబితా మార్పులు చేర్పులపై ఈసీ బృందం సమీక్షించింది. లోపాలు లేని ఓటర్ల జాబితా ఉండాలని అధికారులను ఆదేశించింది. రిటర్నింగ్ అధికారుల సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల




ప్రధానాధికారిని ఆదేశించింది. జూన్ 1 నుంచి ఇవిఎంల మొదటి దశ తనిఖీ చేపట్టాలని అధికారులు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారులకు రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహిస్తామని పేర్కొంది. ఇ÷ఎఓ లను పరీక్షించి అన్ని జిల్లాలకు పంపామని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. అధికారులకు శిక్షణ కోసం ప్రణాళిక రూపొందించాలని సూచించింది. పోలింగ్ శాతం పెరిగేలా కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల బృందం ఆదేశించింది. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2018 డిసెంబరు 7న జరిగాయి. తన పదవీ కాలం పూర్తయ్యే 9 నెలల ముందు సెప్టెంబరు 6 2018న సీఎం కేసీఆర్ రాజీనామా చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. దీంతో సాధారణ ఎన్నికలకంటే ముందే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది.

# దేశంలో కొనసాగుతున్న కరోనా ఉధృతి

### ● 10వేలకు పైనే కొత్త కేసులు నమోదు

**న్యూఢిల్లీ,ఏప్రిల్15(ప్రజా మంటలు):** దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా రోజువారీ కేసులు వేలల్లో నమోదవుతున్నాయి. శనివారం కూడా 10వేలకు పైనే కొత్త కేసులు బయటపడ్డాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 24




గంటల వ్యవధిలో 1,58,625 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా.. 10,753 కేసులు బయటపడ్డాయి. మరోవైపు దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 53,720కి చేరింది. ఇప్పటి వరకు కరోనా మహమ్మారి నుంచి 4,43,22,211 మంది కోలుకున్నారు. గత 24 గంటల వ్యవధిలో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం కొవిడ్ మరణాల సంఖ్య 5,31,091కి ఎగబాకింది. ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో 0.12శాతం కేసులు యాక్టివ్‌గా ఉన్నట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. రికవరీ రేటు 98.69 శాతం, మరణాల రేటు 1.19 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. 220.66 కోట్ల (220,66,25,517) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు కేంద్రం వెల్లడించింది.

# బీహార్‌లో కల్తీమద్యానికి ఐదుగురు బలి

**పాట్నా,ఏప్రిల్15(ప్రజా మంటలు):** బీహార్ రాష్ట్రంలో మరోమారు కల్తీ మద్యం కలకలం రేపింది. మోతిహారిలో శనివారం కల్తీ మద్యం తాగి ఐదుగురు మరణించారు.ఈ ఘటనలో మరో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. బీహార్‌లోని మోతీహరి జిల్లా లక్ష్మీపూర్ గ్రామంలో కల్తీ మద్యం తాగి మరో 12 మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రి పాలయ్యారు.సంపూర్ణ మద్యనిషేధం అమలులో ఉన్న బీహార్ రాష్ట్రంలో తరచూ కల్తీ మద్యం తాగడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ఘటనపై బీహార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు?

(నిన్నటి సంచిక తరువాయి)

రాజ్యాంగంలోని 14, 15, 16, 17, 18, 19, 21, 32, 46, 340 ఆర్టికల్స్ చట్ట సమానత్వానికి, సమానత్వం సాధించడానికి సంబంధించినవి. చట్ట సమానత్వాన్ని రూల్ ఆఫ్ లా అంటారు. అంటే చట్టంముందు ఎవరూ అధికులు కారు. చట్టపరమైన అంశాలు అందరికీ సమానంగా ఉంటాయి. అయితే ఆర్థికంగాను, సామాజికంగా, భౌగోళికంగా, విద్యాపరంగా, దేహదారుఢ్య పరంగా, రాజకీయంగా అసమానతలున్న చారిత్రక పరిణామాల నుండి అనేక రాజ్యాలు, ప్రాంతాలు కలిసి విభిన్న పరిపాలనా వ్యవస్థలో ఉన్న దశ నుండి ఒకే ఒక రీతిలో ఉండే సామాజిక వ్యవస్థకు, భారత రాజ్యాంగ వ్యవస్థకు అనుసంధానం చేసి అందులో భాగం చేయబడ్డాయి. వికలాంగులు గుడ్డివాళ్ళు, పహిల్వాన్లు, బలవంతులు, స్త్రీలు, పురుషులు అందరూ కలిసి ఒకే గోదాలో కలిసి జీవించడం, పోట్లాడుకోవడం, గెలుచుకోవడం అనే పద్ధతి సరియైంది కాదు.

రాజ్యాంగంలో బలహీనులకు, వెనుకబడిన వర్గాలకు, షెడ్యూల్ కులాలకు, షెడ్యూల్ తెగలకు, మైనారిటీలకు, భాషా మైనారిటీలకు, బాలలకు, మహిళలలకు, ప్రత్యేక అవకాశాలు, రక్షణలు కల్పించ బడ్డాయి. వీటిని బలవంతులు ప్రతిభ పేరిట, మెరిట్ పేరిట వ్యతిరేకిస్తూ ఇవి స్వేచ్ఛా సమానత్వానికి, సమాన అవకాశాలకు భిన్నమైనవని వాదిస్తూ న్యాయస్థానాల్లో విజయాలు సాధిస్తున్నారు. న్యాయస్థానాల్లో ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులు కాకుండా, కొన్ని సామాజిక వర్గాల వారే ఉండడం వల్ల వారి దృష్టి కోణం కూడా వారికి అనుకూలంగా కొనసాగుతూ వచ్చింది.

సామాజిక న్యాయం అనేది బలవంతుల నుండి బలహీనులకు రక్షణ కల్పించడం కోసం. ఎదిగించడం కోసం, సమాన అవకాశాలు అందించడం కోసం. బుద్ధునికి పూర్వం నుండి గణతెగల, జనపదాల రాజ్యాల నుండి కూడా సామాజిక న్యాయం అనేది బలవంతులనుండి బలహీనులను, అశక్తులను, పిల్లలను, మహిళలను కాపాడి రక్షించడానికి వారికి అవకాశాలు కల్పించడానికి కృషి చేశారు. రాజును తండ్రి అని పిలవడం జరిగింది. అంటే రాజు ప్రజలకు తండ్రిగా అన్ని సమకూర్చి అందర్ని ఎదిగించే కృషి చేయాలని దాని భావన. అది ఒక గొప్ప ఆదర్శం. ఈ ఆదర్శం ఆచరించేవారు ఆచరించారు. ఆచరించనివాళ్ళు మనుస్మృతిని, నారద స్మృతిని, వర్ణాధిక్య వ్యవస్థను, కుల వ్యవస్థ అంతరాలను తదనుగుణంగా శిక్షల్లో, అవకాశాల్లో వివక్షను, అంతరాలను కొనసాగించారు. వర్ణ, కుల వ్యవస్థలు నిరంతర వివక్షకు, అసమానతలకు గురి చేస్తూ వచ్చాయి.

బౌద్ధం అందరికి సమానత్వాన్ని ప్రబోధించింది. సమ్రాట్ అశోకుడు ప్రపంచంలో మొట్టమొదటిసారిగా భారత ఉపఖండంలో గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించడానికి బౌద్ధంలోని సమానత్వం, సమాన అవకాశాలు అనేవే ప్రాతిపదికగా పని చేశాయి.

మెరిట్ పేరిట, ప్రతిభ పేరిట అవకాశాలు ఇవ్వాలని కోరడం అనే కొత్త రూపంలో ఉన్నదేమిటి? బలవంతులు, శక్తివంతులు అన్ని అవకాశాలు తమకే ఉండాలని కోరడమే తప్ప వేరుకాదు.

శతాబ్దాలుగా సమస్థ సంపదలను, ఉత్పత్తులను సృష్టించింది శూద్రులే. ప్రకృతి వనరులను, ఖనిజాలను, వెలికితీసి, కత్తులు, కటార్లు, నగలు, నాణేలు, కోటలు, దుర్గాలు, బట్టలు, పంటలు, ఇనుము, వెండి, బంగారం, ఇత్తడి, రాగి మొదలైనవన్నీ వెలికి తీసి నాణ్యమైనవిగా తయారు చేసి ఈ సమాజాన్ని సుసంపన్నం చేసింది శూద్రులే. శూద్రులు సృష్టించిన సంపద అపారమైనది.



సంపదను కొల్లగొట్టడానికి శతాబ్దాలుగా అనేక ప్రాంతాలనుండి భారత ఉపఖండంలోకి దాడులు, దండయాత్రలు, వలసలు సాగాయి. తరతరాలుగా తరలించుకుపోయినా తరగని సంపద శూద్రులు సృష్టించారు. ఒక్క కేరళలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలోగల సంపద నేటికీ గమనిస్తే అది ఎంత గొప్ప సంపదో తెలుస్తుంది. అలా సోమనాథ దేవాలయం వంటి వందలాది దేవాలయాల్లో రాజుల ధనాగారాల్లో గుళ్ళు, గోపురాల నిర్మాణాల్లో, యుద్ధాల్లో తరలిన సంపద అంతా శూద్రుల సృష్టే. అందువల్ల ప్రతిభ, మెరిట్ ప్రాతిపదికగా తరతరాల నైపుణ్యాలకు వారసులైన ఆయా సామాజిక వర్గాలైన శూద్రులకు నేటి మొత్తం పారిశ్రామిక రంగం చెందాలి. అప్పుడు ప్రతిభ గురించి, మెరిట్ గురించి నిజమైన అర్థం ఏర్పడుతుంది.

2. ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు

ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే. జన్మనా జాయతే శూద్ర అని అంటారు. పుట్టుకతో అందరూ శూద్రులే. కుల వివక్షను భారత రాజ్యాంగం నిషేధించింది. అయినా సాహిత్యం, సంస్కృతి, పురాణ ఇతిహాసాలు, కళలు, సామెతలు, నుడికారాలు, భాష, వ్యాకరణ, రూపంలో కుల వివక్ష, కుల అంతరాలు ప్రచారం చేయబడుతున్నాయి. భారత రాజ్యాంగ ఆదర్శాలకు వ్యతిరేకంగా సాగుతున్న వీటిని ప్రజాస్వామికీకరించాల్సిన అవసరం ఉంది.

ఒక గిరిజనుడికి 20 వేల ర్యాంకుతో మెడిసిన్ సీటు వచ్చింది. 2 వేల ర్యాంకు వచ్చిన వారికి సీటు రాలేదు. దీన్ని ఏ కోణంలో చూడాలి? గిరిజనులు ఎంత వెనుకబడి ఉన్నారో, వారిలో నైపుణ్యాలను, విద్యను, విద్యా ప్రమాణాలను ఎంతగా పెంచాల్సి ఉందో అనే సానుకూల దృష్టితో ఆలోచించి, పథకాలు ప్రవేశపెట్టి, వారు కూడా రెండువేల లోపు ర్యాంకు దాకా చేరుకునేట్టు చేసినప్పుడే నిజంగా వారి అభివృద్ధి కోసం కృషి చేసినట్టు. ఇలా ఆలోచించకుండా నాకు రాలేదు. వారికి వచ్చింది అని విమర్శించడం వ్యక్తిగత స్వార్థంలో భాగం.

ప్రతి సామాజిక వర్గానికి, కులానికి ప్రాతినిధ్యం, అవకాశం జనాభా దామాషా మేరకు ప్రతిపాదించి అమలు జరిపితే అన్ని ప్రాంతాలకు, కులాలకు, వర్గాలకు సంబంధించిన వారికి అవకాశాలు అందుతాయి. తద్వారా ఆయా సామాజిక వర్గాల్లో, కులాల్లో ఒక స్ఫూర్తి, ఉత్తేజంతోపాటు వారి ప్రాతినిధ్యం పెరుగుతుంది. తద్వారా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో, ఆచరణలోకి వస్తుంది.

ముస్లింలు ఇండియాలోకి ప్రవేశించక ముందు దేశమంతటా అనేక మతాలు కొనసాగాయి. జైనం, బౌద్ధం, కాపాలికం, శాక్తేయం, శైవం, వైష్ణవం, అజీవకం మొదలైన వాటితోపాటు వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ బ్రాహ్మణీయ వ్యవస్థ మతాలుగా, రాజ్యాంగాలుగా, సంస్కృతిగా, పౌర, నేర, శిక్షాస్మృతులు కొనసాగుతూ వచ్చాయి.

వర్ణ, కుల వ్యవస్థ బాధితులు అణచివేయ బడినవారు ఇస్లాం స్వీకరించారు. కాలక్రమంలో క్రైస్తవ పాలకులు రావడంతో క్రైస్తవం స్వీకరించారు. అలా దేశంలో ఇస్లాం, క్రైస్తవం విస్తరించడానికి వర్ణ, కుల వ్యవస్థలను సమర్థిస్తూ సాగించిన శిక్షాస్మృతులు, అణచివేతలు, అవమానాలు ప్రధాన కారణం. రాజుల మతాన్ని ప్రజలు స్వీకరించడం అశోకుని కాలం నుంచి కొనసాగుతున్నదే.

భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు, ఆశయాలు, మార్గదర్శకాలకు భిన్నంగా సమస్థ, వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, భాష, మత, వివక్షతలను ప్రేరేపించే, ఉద్దేశించే, వివక్ష, అస్పృశ్యత, కులాంతరాలు మొదలైనవాటిని

(ఇంకా ఉంది)



- బి ఎస్ రాములు
బీసీ కమిషన్ మాజీ చైర్మన్
8331966987








# స్వచ్ఛ అవార్డులు గుజరాత్‌కు ఎందుకు రావట్లేదు

### మోడీని ప్రశ్నించిన మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు):** స్వచ్ఛ గ్రామీణ అవార్డులు తెలంగాణకు వచ్చినంతగా గుజరాత్‌కు ఎందుకు రావడం లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు వల్ల తెలంగాణ గ్రామాలు సంపూర్ణ అభివృద్ధిని సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల జాతీయ అవార్డులు పొందిన తెలంగాణ గ్రామాలు, మండలాలు, జిల్లా పరిషత్‌ల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ నెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడానికి వెళుతున్నారు. ఈ సందర్భంగా వారికి, హైదారాబాద్ లోని మంత్రుల నివాసంలో అల్పాహార విందు ఇచ్చి వీడ్కోలు పలికారు. ఆయన మాట్లాడుతూ సీఎం ప్రత్యేక చొరవతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు.' గ్రామాల్లో అన్ని సదుపాయాలు పెరిగాయి. ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు వస్తాయని కూడా ఎవరూ ఊహించలేద'



ని వెల్లడించారు.

ఇప్పటివరకు గత మూడేళ్లలో రాష్ట్రానికి 79 అవార్డులు వచ్చాయని, ఇంకా వస్తాయని ధీమాను వ్యక్తం చేశారు. కేంద్రం సహకరిస్తే, ఇంకా అభివృద్ధికి అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ చెప్పినట్లు, అసెంబ్లీ తీర్మానం చేసిన విధంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే బాగుంటుందని కేంద్రానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ములుగు జిల్లా చైర్మన్ కుసుమ జగదీశ్, కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు, ప్రత్యేక కమిషనర్లు ప్రసాద్, ప్రదీప్ శెట్టి , అవార్డులు పొందిన సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీపీలు, డీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే విమర్శలు

### బండి సంజయ్‌పై మండిపడ్డ కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (ప్రజా మంటలు):** ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పై రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. దేశంలోనే అత్యంత ఎత్తులో 125 అడుగుల భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం అవిష్కరించుకున్న సందర్భంగా బండి సంజయ్ చేసిన విమర్శలు అర్ధరహితమని అన్నారు. బండి సంజయ్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారని, అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. పేపర్ లికేజీ ఘటనలో పట్టపగలు పట్టు బడిన దొంగ బండి సంజయ్ అని ఆరోపించారు. దళితుల జనోద్ధారణ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ని విమర్శించే నైతిక అర్హత అతడికి లేదన్నారు. తెలంగాణ సచివాలయం భవనానికి అంబేద్కర్ పేరు పెట్టినందుకు విమర్శలు చేస్తున్నారా? లేక నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నందుకు విమర్శిస్తు న్నారా సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ పై తెలంగాణ సర్కార్ పై చేసిన విమర్శలకు బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని



డిమాండ్ చేశారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే తగిన రీతిలో సమాధానం చెబుతారని హెచ్చరించారు.

# సిట్ కస్టడీలో లౌకిక్, సుస్మిత

**హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజా మంటలు):** టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఖమ్మంకు చెందిన దంపతులు లౌకిక్, సుస్మితలను సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. సిట్ కార్యాలయం నుంచి ఉదయం 8 గంటలకు ఇద్దరినీ తీసుకుని సిట్ అధికారులు ఖమ్మం వెళ్ళారు. సుస్మితా, లౌకిక్ ఇంట్లో సోదాలు చేయనున్నారు. వారి వాహనాన్ని కూడా సిట్ అధికారులు సీజ్ చేయనున్నారు. ప్రవీణ్ నుంచి భార్య కోసం లౌకిక్ డీఏవో పేపర్ కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఏప్రిల్ ఏడో తేదీన లౌకిక్, సుస్మితలను అరెస్ట్ చేశారు.

# అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అద్భుతం

### కెసిఆర్‌ను అభినందిస్తూ స్టాలిన్ ట్వీట్

**చెన్నై,ఏప్రిల్15(ప్రజా మంటలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున 125 అడుగుల ఎత్తులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కేసీఆర్‌కు స్టాలిన్ అభినందనలు తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని అటు బుద్ధ విగ్రహానికి, ఇటు తెలంగాణ నూతన సచివాలయానికి మధ్య ఏర్పాటు చేయడం అద్భుతమని స్టాలిన్ ప్రశంసించారు.హుస్సేన్ సాగర్ తీరాన 125 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి సీఎం కేసీఆర్ నిన్న ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ నలు మూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన దళిత నాయకులు, ప్రజలు హాజరయ్యారు.

## మందకొండిగా సాగుతున్న డిజిటల్ కేబుల్ లైన్

**సైదాపూర్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో డిజిటల్ కేబుల్ లైన్ గుంతలు తీశారు నత్త నడకన నడుస్తున్న డిజిటల్ కేబుల్ లైన్ రోడ్డు ఇరుకుగా ఉన్నందున రోడ్డు



ప్రమాదలు జరిగాయని బాటసారులు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పట్టించుకోని కాంట్రాక్టర్లు గ్రామస్థాయి అధికారులు కేబుల్ లైన్ కుంతలు వెంటనే మరమత్తు చేయించి ఇబ్బందులు గురికాకుండా చేయాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. వాహనదారులు రహదారిలో ఒక బండి వస్తే, ఇంకో బండి రాక పోకలు ఇబ్బంది ఎదురై ప్రమాదాలు జరిగాయని పెంటనే కేబుల్ లేని పనులు పూర్తి చేయించాలని గ్రామస్తులు ఆందోళన చేశారు.

## న్యాయశాస్త్రంపై అవగాహన సదస్సు

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో అంబెద్కర్ జయంతి సందర్భంగా న్యాయశాస్త్రం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో జగిత్యాల సబ్ జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ....న్యాయ




పరమైన సమస్యలు ఎలా వస్తాయి. వాటిని ఎలా ఎదుర్కోవడం అని చెప్పారు. విద్యార్థులకు రాజ్యాంగం గురించి, దేశంలో ఉన్న కోర్టులు, వాటి పరిది గురించి వివరించారు. విద్యార్థులు వారి వారి న్యాయ సంబంధమైన ప్రశ్నలకు జడ్జ్ ద్వారా జవాబులు తెలుసుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో సామాజిక వేత్త డా. రాజగోపాల చారి, కళాశాల చైర్మన్ ముసిపట్ల రాజేందర్, డైరెక్టర్ నేరెళ్ల మల్లేశం గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ మామిడిపెల్లి రాజన్న మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజేశ్వరి అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం

**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని నాగంపల్లి గణేష్ అన్నారు. తమ పుట్టినరోజు సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వరి అనాథ వృథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం పండ్లు బెడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... అనాధ



వృద్దులకు అన్నదానం చేయడం చాలా తృప్తిగా ఉందన్నారు. వృద్ధులను చేరదీసిన ఆశ్రమ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వృద్ధులకు సేవ చేసేందుకు ప్రేరణ కల్పిస్తున్న పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్ సంస్థ సభ్యులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గాజులపాటి మోక్షజ్ఞ సాగర్, రాకేష్ రెడ్డి, అరవింద్ రెడ్డి, గణేష్, ఆనంద్, జంపి సంజయ్, శ్వేతా గౌడ్, నాగలక్ష్మి జోగు భాస్కర్, రంజిత్, దిలీప్, గుజ్జుల నాలిన్, రోహిత్, జోగు ఉదయ్, నరేంద్ర పవన్ , మను, నాని, ఆలకుంట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నేడు ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలను చేపట్టిన బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం నాయకులు.

## ఇథనాల్ పరిశ్రమను సిరిసిల్లలో ఏర్పాటు చేసుకోండి

- విద్యా సంస్థలు మీకు..
- విష వాయువుల పరిశ్రమ మాకా!?
- తెలంగాణలో ఓటు వేసెట్టు కనపడుతలేరు
- అందుకే ఆంధ్రోళ్లకి ఓటు హక్కు ఇస్తమంటున్నరు
- ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల ఏప్రిల్ 15(ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ తమ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని 20 రోజులుగా రాజకీయాలకు అతీతంగా వెల్గాటూర్ మండలంలోని పాశిగాం, వెంకటాపూర్ స్తంభంపల్లి వెల్గటూర్ గ్రామాల ప్రజలు ఉద్యమిస్తున్న, వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పరిశ్రమ ఏర్పాటు కు పనులు ప్రారంభించేందుకు మంత్రి కొప్పుల ఈశ్వర్ భూమి పూజ చేయడం సరికాదన్నారు. తొమ్మిది కోట్ల లీటర్ల విత్తనాలు ఉత్పత్తికి ఒక టీఎంసీ నీరు అవసరం అవుతుందని, సాగునీరుతో పాటు హైదరాబాదు ప్రాంతానికి తాగునీరు అందించే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి తీసుకున్న నీరు వినియోగించిన అనంతరం మళ్లీ అదే జలాశయంలోకి మళ్లిస్తారన్నారు. వాస్తవ పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా కాంగ్రెస్ రాజకీయంగా అడ్డుకోవాలని చూస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నరని అన్నారు. కాలుష్య ప్రభావిత పరిశ్రమ ఏర్పాటు చేసేటప్పుడు ప్రభావిత గ్రామాల ప్రజల అభిప్రాయాలను సేకరించడం తప్పనిసరినే నిబంధన కూడా మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తు.. కాలుష్యాన్ని విత్తనాలు పరిశ్రమలు మాత్రం మరోచోటికి ఎందుకు తరలించారు అని ప్రశ్నించారు. వెల్గటూర్ లో ఎల్లంపల్లి జలాశయం అందుబాటులో ఉందని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయని చెబుతున్న కొండూరి రవీందర్రావు సిరిసిల్ల ప్రాంతంలో సైతం మిడ్ మానేరు అందుబాటులో ఉందనే విషయాన్ని మరిచారా అని ప్రశ్నించారు. విద్యా సంస్థలు సిరిసిల్లలో ఏర్పాటు చేస్తూ కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. ఉమ్మడి రాష్ట్రంలో పంట రుణాల పై నాలుగు శాతం దీర్ఘకాలిక మధ్య కాలిక రుణాలపై ఆరు శాతం రాయితీ రైతులకు ఇచ్చిన మాట వాస్తవమా కాదా రవీందర్ రావు చెప్పాలన్నారు. రైతుల పక్షాన నిలబడి మాట్లాడాల్సిన రవీందర్రావు పదవినీ కాపాడుకునేందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా రైతుల నోట్లో మట్టి కొట్టిన కొండురి రవీందర్ రావుకు మాట్లాడే హక్కు లేదని



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. తొమ్మిదేళ్లుగా రైతులకు పంట రుణాలపై నాలుగు శాతం వడ్డీ రాయితీ దీర్ఘకాలిక మధ్య కాలిక రుణాలపై 6% రాయితీ ఇప్పించక పోయిన రవీందర్ రావు టేస్కాబ్ చైర్మన్ గా కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ లో 51% వాటా విక్రయించగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటు అనంతరం పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు చేపడతామని చెప్పడంతో పాటు, మేనిఫెస్టోలో సైతం పెట్టారని అన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం మిగిలిన నలభై తొమ్మిది శాతం వాటాను సైతం విక్రయించి పూర్తిగా ప్రైవేటుపరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార సంస్థ ఆధ్వర్యంలో చక్కెర ఫ్యాక్టరీ పునః ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని అన్నారు. సహకార సంస్థలు మీ చేతిలోనే ఉన్నాయి కదా ఎందుకు పున ప్రారంభించడం లేదని నిలదీశారు. కేవలం 1000 కోట్లు విడుదల చేస్తే మూడు చక్కర కర్మాగారాలు పునః ప్రారంభించవచ్చు అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. వైద్య నాథన్ కమిటీ సిఫార్సుల మేరకు కాంగ్రెస్ సహకార సంస్థలకు 4000 కోట్లు గ్రాంట్ ఇచ్చామని గుర్తు చేశారు. ఎఫ్సిఐ ప్రతి క్వింటాల్కు హమాలీ చార్జీలు రు.5.50 ఇస్తోందని, రైతులకు ఈ హమాలీ చార్జీలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వమే జేబులో వేసుకుంటుంది. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే వలసలు తప్పవని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇప్పించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్కు హితవు పలికారు. కొప్పుల ఈశ్వర్ భేషజాలకు పోకుండా వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. మంత్రి కొప్పుల గతంలో ఒక వెయ్యి 90 సర్వే నెంబర్లు సర్వే చేయించి ఆసుపత్రి గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారన్న విషయం గుర్తు చేసుకోవాలన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర ఇథానాల్ పరిశ్రమపై ప్రజలను ఎందుకు ఒప్పించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే 3వ టిఎంసీ పేరిట పెగడపెల్లి, గొల్లపల్లి, వెల్గటూర్ మండలాల్లో కోట్లాది విలువ భూములు సేకరించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్వాసితులకు సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో భూసేకరణలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు తాము ఇచ్చామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, పిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లేపల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, ఎండి మున్నా, చందా రాధా కిషన్, పిసిసి ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా, మొగిలి మహిపాల్ మారు గంగారెడ్డి సర్పంచులు శైలేందర్ రెడ్డి మురళి వెల్లటూరు మండల గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాదిగల ఆర్థిక అభ్యున్నతి కోసమే డిక్కా సంస్థ ఆవిర్భావం

- చైర్మన్ రాగటి సత్యం

**సికింద్రాబాద్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** నిరుపేద మాదిగ, ఉపకులాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి సహకరిడానికై తాము డిక్కా సంస్థను ఏర్పాటు చేసినట్లు చైర్మన్ రాగటి సత్యం అన్నారు. శనివారం బన్సీలాల్ పేట బీజేఆర్ నగర్ లోని సంస్థ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సంస్థ వ్యవస్థాపక జాతీయ అద్యక్షుడు రాగటి భవాని కుమార్ తో కలసి మాట్లాడారు. అణగారిన కులాల పారిశ్రామిక, నిశ్చయ కార్యాచరణ, వాణిజ్య మండలి (డిక్కా) పేరుతో రిజిస్టర్డ్ చేయబడిన తమ సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల అభ్యున్నతి కోసం విజయవంతంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామ స్థాయిలలో ప్రజా చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిభిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల ఫలాలు ఎస్సీలలో అన్ని ఉపకులాల వారికి సమానంగా అందాలన్న అంబేద్కర్, జగ్జీవన్రామ్ మహానీయుల ఆశయాలకు అనుగుణంగా తాము వివిద బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మాదిగలు, ఉపకులాల వారు ఎదగాలని, తమ సంస్థ ద్వారా పరిశ్రమలకు , బ్యాంకులకు , లబ్దిదారులకు మధ్య




వారధిలాగా నిజాయితీగా కృషి చేస్తామన్నారు. పేద మాదిగలు బన్సీలాల్ పేట బీజేఆర్ నగర్ లోని తమ సంస్థ కార్యాలయానికి నేరుగా రావొచ్చని వారు కోరారు. ఈనెల 22వ తేదీన తమ సంస్థ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ మహానీయులకు నివాళులు అర్పించేందుకు మహాసభ, దళిత చైతన్య సదస్సు నిర్వహిస్తామన్నామని వారు పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు ఎం. శివకుమార్ లాల్, బీ. నర్సింగ్ రావు, బి. కృష్ణంరాజు, కే. గాంధీ కుమార్ లు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

- ఆర్డీవో వినోద్ కుమార్

**కోరుట్ల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని కోరుట్ల ఆర్డీవో టి. వినోద్ కుమార్ అన్నారు. శనివారము ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్స్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ.... పండుగ అనేది మానవాళికి హితాన్ని భోదిస్తుందని, ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి ఆందిస్తుందన్నారు..మన జాతీయతకు, సంస్కృతి కి దోహదం చేస్తున్న అన్ని పండుగలు జాతీయ సమైక్యతకు ప్రతిభింబమన్నారు. సీనియర్ సిటీజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్స్ కలిసి మెలసి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మత సామరస్యంగా మెలిగినట్లే అన్ని మతాల పండుగల్లో జాతీయ సమైక్యత చూపాలన్నారు. సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ....ఇఫ్తార్ విందులు జాతీయ సమైక్యత కు నిదర్శనమన్నారు. దివ్య ఖురాన్ గ్రంధం రంజాన్ మాసంలో ఆవిర్భవించినట్లు గుర్తు చేశారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన పెన్షనర్స్ సీనియర్ సిటీజన్స్ కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, జిల్లా సీనియర్ సిటీజన్స్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పెన్షనర్స్ సహాయ అధ్యక్షుడు



పి.సి. హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.డి. యాకుబ్, డివిజన్ పెన్షనర్స్, సీనియర్ సిటీజన్స్ నాయకులు రాజ్ మోహన్, సైఫోద్దీన్, రాజయ్య, మహమ్మద్ జావీద్, సాబితలి, జాఫర్, మహమ్మద్ ఇస్మాయిల్, రాజేశం సీనియర్ సిటీజన్స్, పెన్షనర్స్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డు రావడం చాల సంతోషాన్ని కలిగించింది

**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** దళితరత్న అవార్డు రావడం చాల సంతోషాన్ని కలిగించిందని మాల మహాసభ స్టేట్ వర్కింగ్, ప్రెసిడెంట్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జ్ తాటి కుమార్ అన్నారు. ఈ సందర్భంగా కుమార్ శనివారం జనగామలో మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డులను ప్రధానం చేస్తుందని, 132వ జయంతి ఉత్సవాల సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ జంగా శ్రీనివాస్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డును తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా జనగామకు చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత డాక్టర్ రాజమౌళి, మాల సంఘాల ఐక్యవేదిక చైర్మన్ చెరుకు రామచంద్రం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి రవి, సిరిగిరీ గిరి(గిరన్న), మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నాగభూషణం, గ్రేటర్ వరంగల్ మాల మహానాడు అధ్యక్షులు అంకేశ్వర రామచందర్ రావు తదితరులు వేదిక ప్రాంగణంలో అభినందించారు. నా ఆత్మీయులు అందరికీ మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు కి, ఇతర ఆత్మీయులకు ధన్యవాదాలు తెలిపారు.



## దేవరాజుల బాలశివుడు పుట్టినరోజు పండ్లు పంపిణీ

**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** దేవరాజులు వెంకన్న కుమారుడు దేవరాజుల బాలశివుడు పుట్టినరోజు సందర్భంగా జనగామ పట్టణంలో స్థానిక రైల్వే స్టేషన్ దగ్గర చిన్నపిల్లలకు నిరాశ్రయులకు అరటి పండ్లు పంపిణీ చేసి ఘనంగా



జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమరాజు యువత పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై ఆకలితో అలమటిస్తున్న నిరాశ్రయులకు ఆకలి తీర్చి జరుపుకోవడం చాలా సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన నాయకులు బొట్ల సాయి, అమ్మ ఫౌండేషన్ టీం బింగి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీతకు సన్మానం

**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు కళ్లెం గ్రామంలో అట్టహాసంగా నిర్వహించారు. జయంతి వేడుకల అనంతరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మరియు స్నేహ యూత్ అధ్యక్షులు మబ్బు క్రాంతి కుమార్, మబ్బు కన్నయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత మబ్బు పరశురాం ని శాలువాతో,పగిడితో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామవాసి మబ్బు పరశురాం లెక్చరర్ కి జాతీయస్థాయి అంబేద్కర్ అవార్డు రావడం గ్రామ ప్రజలందరికీ చాలా సంతోషక



రమన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ ఈ సత్కారం లభింపచేసిన అంబేద్కర్ యువజన సంఘానికి, స్నేహ యూత్ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎఫ్. జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల ఉపేందర్, మార్పు శ్రీనివాస్ రెడ్డి,మబ్బు మల్లేష్, అంజయ్య, శ్రీధర్, రాజ్ కుమార్, నాగరాజు, శ్రీనివాస్, శేఖర్, కనకరాజు, కరుణాకర్ అభినందించారు.

## గెల్లు శ్రీనివాస్‌ను అభినందించిన వినోద్ కుమార్

**హైదరాబాద్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా శనివారం హైదరాబాద్ జల విహార్ లో బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్



పాల్గొని గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని బోయినపల్లి వినోద్ కుమార్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ కు సూచించారు. సమైక్య రాష్ట్ర పాలనలో తెలంగాణ ప్రాంతంలో టూరిజం నిర్లక్ష్యానికి గురైందని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# ఆలయ పునః నిర్మాణమునకు రూ. 25,016 విరాళం

**కొడిమ్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు)** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణమునకు ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా లింగ సముద్రం మండలానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్ (మేస్త్రి)-వాణి



ల సంతానం లక్ష్మి చైత్ర , చందన, ధరణి ల కుటుంబం వ్యాపార రీత్యా కొడిమ్యాలకు 8 సంవత్సరాల క్రితం వచ్చి స్థిరపడినారు. వీరు ఆలయ నిర్మాణానికి శాశ్వత చందాదారులుగా 25,016౦౦ రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ ఆశీర్వదించి స్వామివారి మంగళ శాసనములు అందజేసినారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన దాతల కుటుంబానికి గ్రామస్తుల తరపున, ఆలయ కమిటీ తరపున, భక్తుల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేయడం జరిగింది.

# రైతుకు ఋణ పంపిణీ


**ధర్మపురి ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధర్మపురి ఆధ్వర్యంలో బావి మరియు పైపు లైన్ త్రవ్వకం కోసం జిల్లామార్కెటింగ్



కమిటీ ఛైర్మన్ అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి 5,20,000/- రూపాయల చెక్కులను సరసాని తిరుపతమ్మ సిరికొండ కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రైతులు తక్కువ వడ్డీ కి ఋణం పొంది తిరిగి సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్, సంఘ డైరక్టర్ లు పెరుమాండ్ల ఏళ్లగౌడ్, పెరుక రమేష్, గుర్రాల పెద్ద పోచం, కౌన్సిలర్ లు ఒడ్నాల ఉమాలక్ష్మి, రైతు సమన్వయ సమితి సభ్యులు ఒడ్నాల మల్లేశం, అయ్యోరి రాజేష్ పాల్గొన్నారు.

# హన్మకొండ వెళ్ళే ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చండి


**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** మున్సిపల్ కమిషనర్ ని కలిసి జనగామ నుండి హన్మకొండకి వెళ్లె రహదారిని మరమ్మతు చేయాలని ఎన్.ఎస్.యు.ఐ.




జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్ కోరారు. జనగామ చౌరస్తా నుండి హన్మకొండ వెళ్లె ప్రధాన రహదారిలో గుంతలు పడటం వలన ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని, ఆ గుంత ఏర్పడి దాదాపు నెల గడుస్తున్న ఇప్పటి వరకు ఏ ఒక్క సంబంధిత అధికారి పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని గోపిచంద్, అజయ్ కోరారు.

# గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను కలిసిన బి.ఆర్.ఎస్.వి. జిల్లా కో ఆర్డినేటర్‌లు

**జనగామ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** భారత రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ శనివారం తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ చైర్మన్



గా భాద్యతలు స్వీకరించిన సందర్భంగా హైదరాబాద్ లోని జలవిహార్ లో గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను జనగామ బి.ఆర్. ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ లు మేడారపు సుధాకర్, రావుల తిరుమల్ రెడ్డి, జనగామ జిల్లా యువజన నాయకులు కోతి ప్రవీణ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారునికి సరైన గుర్తింపు లభించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ కు, మంత్రి కేటీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# గెల్లును సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి, బోయినపల్లి వినోద్ కుమార్

- గెల్లు ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన హుజురాబాద్ నాయకులు

**హుజురాబాద్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో గల జలవిహార్ లో శనివారం జరిగిన హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా పదవి బాధ్యతల స్వీకర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, హోంశాఖ మంత్రి మొహమ్మద్ అలీ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి, సురభి వానిదేవి, బండ ప్రకాష్, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్, కరీంనగర్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జివి రామకృష్ణారావు, కూడాచైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... ఉద్యమకారుడైన గెల్లు కు కార్పొరేషన్ పదవి రావడం ఆనందంగా ఉందని అన్నారు. టూరిజం ను బలోపేతం చేయాలని ఆయన కోరారు. బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీ లో కష్టపడ్డ వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా శ్రేయస్సు కోరే ప్రతి కార్యకర్త ఒక మంచి నాయకుడు అవుతాడని దానికి గెల్లు మంచి ఉదాహరణ అని ఆయన అన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడు అవుతాడని రాబోయే రోజుల్లో ఆయన పార్టీకి ఉపయోగపడతాడని కాబట్టి ఆయనకు ఈ పదవి రావడం చాలా హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్ మున్సిపల్ చైర్ పర్సన్ గందే రాధిక శ్రీనివాస్, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్ కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, కల్లపల్లి రమాదేవి, మారపల్లి సుశీల, మక్కా పెల్లి కుమార్ బర్మావత్ యాదగిరి పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి జెడ్పిటిసి బక్క రెడ్డి ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బండి రమేష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కనబోయిన శ్రీనివాస్ యాదవ్, మండలంలోని సర్పంచులు కన్నబోయిన తిరుమల తిరుపతి,



గూడూరి ప్రతాప్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నిరోషా కిరణ్, ఉపసర్పంచ్ బెల్లి రాజయ్య లు, ఎంపీటీసీలు అఖిలభారత యాదవ మహా సభ మండల అధ్యక్షులు బద్దుల రాజ్ కుమార్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సంఘం ఐలయ్య, టౌన్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయకుమార్ తాళ్లపల్లి రమేష్, కన్నబోయిన మహేందర్, ప్రభాకర్, కాజిపేట శ్రీనివాస్, ధనవర్ష రాజు, ఉప్పు శ్రీనివాస్, ఖలీద్, రావుల రాజేష్, దాసరి కోటేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకులపై అక్రమ కేసులు ఆపకపోతే ప్రజలే ప్రతిఘటిస్తారు

- జూపల్లి, పొంగులేటి నాకు మిత్రులు
- ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

**హుజురాబాద్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** అనతి కాలంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ అతి ఎక్కువ ఆస్తులు, అక్రమ సంపాదన సంపాదించిన వ్యక్తి అని, ఆ డబ్బుతో దేశ రాజకీయాలలో చక్రం తిప్పాలనుకుంటున్నాడని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, హుజురాబాద్ శాసనసభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. శనివారం హుజురాబాద్ సబ్ జైల్ లో చెల్పూర్ సర్పంచ్ నేరేళ్ల మహేందర్ గౌడ్ తో ములాఖత్ అయ్యారు. అనంతరంఆయన మాట్లాడుతూ... అక్రమ ఆస్తులు సంపాదించిన సీఎం కేసీఆర్ ఆ సంపాదన తో దేశ రాజకీయాలు చెలాయించాలని చూస్తున్నాడని అన్నారు. ఎప్పుడూ డబ్బుతో విజయం పొందడం కష్టమని ప్రజల అభిమానం పొందాలని అన్నారు అధికార పార్టీ ఈ ఏడాది చివరి వరకే అధికారంలో ఉంటుందని తర్వాత పార్టీకి ఉద్వాసన తప్పదని ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయో అని ఆత్రుతగా చూస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు తనకు మిత్రులని, వారు పార్టీ పెట్టే విషయం పూర్తిగా తనకు సమాచారం లేదని అన్నారు. పలువురు టిఆర్ఎస్ నాయకులు సైతం తమకు ఫోన్లో అందుబాటులో ఉన్నారని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో అధికార పార్టీని దించడంతో పద్యం అని అన్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న నాయకులను పోలీసులతో ఒత్తిడి పెంచుతున్నారని అన్నారు. హుజురాబాద్ ప్రజలు కేసీఆర్ అహంకారానికి ఘోరీ కట్టాక ఆయన హుజురాబాద్ ప్రజల పై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. హుజురాబాద్ పోలీసు అధికారులు అధికార పార్టీకి బానిసలు, అటెండర్ లాగా పని చేస్తున్నారన్నారు. బిజెపి నాయకులపై అక్రమ కేస్ లు ఆపకపోతే




ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదన్నారు. మహేందర్ ని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. ఈ విషయంపై మానవహక్కుల కమిషన్ కు వెళ్తామని అన్నారు. అధికార పార్టీకి పోలీసులు తొత్తుగా వ్యవహరిస్తే అధికారంలోకి వచ్చే పార్టీ వారిపై చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పలువురు బిజెపి నాయకులు ఉన్నారు.

# ఆదర్శంగా నిలుస్తున్న జనహిత సేవా ట్రస్ట్

- తోటి మనిషి ని ఆదుకోవడంలోనే ఎంతో తృప్తి
- స్వచ్ఛంద సంస్థల పనితీరు బేష్
- రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్

**సికింద్రాబాద్ ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** దశాబ్దాల కాలంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజంలో అనేక సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్న జనహిత సేవా ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ అన్నారు. శనివారం తార్నాక లోని మర్రి కృష్ణారెడ్డి పంక్షన్ హాల్ లో జరిగిన జనహిత సేవా ట్రస్ట్ బెనిఫిషరీస్ మీట్%--%2023 కు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ...సకల జనులను కాపాడే దేవుడు ప్రత్యక్షంగా కనిపించకపోయినా, ఇలాంటి స్వచ్ఛంద సేవా చేసే వారి రూపంలో పేదలకు అందిస్తాడన్నారు. జనహిత సేవా ట్రస్ట్ సంస్థ పేదలు, ముఖ్యంగా మహిళలు, యువత స్వయం ఉపాధి, ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమానికి వేలాది కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కరోనా పాండమిక్ లో కరోనా పాజిటివ్ పేషంట్ల వద్దకు వారి కుటుంబసభ్యులే రాలేని పరిస్థితి ఉండేదని, కాని స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లు వారి వద్దకు వెళ్ళి మందులను, ఆహారం, మాస్కులు, పీపీఈ కిట్లు ఇచ్చి, మానవతా ధర్మాన్ని చాటారని ప్రశంసించారు. ఈ సందర్భంగా వివిద రంగాల్లో జనహిత సేవా ట్రస్ట్ నుంచి సహాయం పొంది, జీవితంలో స్థిరపడిన పలువురు బెనిఫిషరీస్ తమ అనుభవాలు, తాము ఎదుర్కొన్న కష్టాలు, ట్రస్ట్ వారు చేసిన సహాయాన్ని సభా




ముఖంగా వివరించారు. సీఎస్ఆర్ కింద నిధులు సమకూరుస్తున్న పలు కంపెనీల ప్రతినిధులు, వాలంటీర్లు, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు హాజరయ్యారు.

# హనుమాన్ చాలీసా కార్యక్రమంలో బహుమతి వితరణ

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో గత ఐదు సంవత్సరాలుగా హనుమాన్ చాలీసా సామూహిక పారాయణ కార్యక్రమం ప్రతి శనివారం సాయంత్రం నిర్వహిస్తున్నారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరవుతున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా పారాయణ మునకు నిర్దేశిత సమయానికి విచ్చేసిన భక్తులందరిలో డ్రా తీసి ఒకరికి స్వామివారి ప్రసాదముగా బహుమతి అందజేస్తున్నారు. కాగా శనివారం హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం డ్రా నిర్వహించగా పి. రమ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్ సంగనభట్ల నరేంద్ర శర్మ చేతుల మీదుగా ప్రసాద రూపకంగా బహుమతి



అందజేశారు. ఈ సందర్భంగా విజేత రమకు పలువురు మహిళలు శుభాకాంక్షలు తెలిపారు.

# కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బద్ది నర్సయ్య

**కోరుట్ల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** 2023-24సంవత్సరానికి గాను కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బద్ది నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అడ్ హాక్ కమిటీ సభ్యులు నన్నపురాజు శ్రీనివాసరాజు, ఆడెపు వినోద్, గాంధారి శ్రీనివాస్ లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కొంపల్లి



సురేష్,ప్రధాన కార్యదర్శిగా బైరి విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సుతారి శ్రీనివాస్, కోశాధికారిగా చిలివేరి రాజశేఖర్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా ఎండీ ఎజాజ్, లైబ్రరీ కార్యదర్శిగా చింతకింది ప్రేమ్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మచ్చ వెంకట రమణ మూర్తి, తోట ఆంజనేయులు, వి. వందన, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గా వనతడుపుల అరుణ్ కుమార్, సంగ విజయ సాయి, ఎండి ఫసియుద్దీన్ ఎన్నికైనట్లు తెలిపారు.

# నిరుద్యోగ మార్చ్‌కు తరలి వెళ్లిన ఎల్కతుర్తి బిజెపి నాయకులు

**ఎల్కతుర్తి ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా ఎల్కాతుర్తి మండలం లోని బిజెపి రాష్ట్ర నాయకులు బండి సంజయ్ పిలుపు మేరకు



హుస్నాబాద్ నియోజకవర్గం నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఎల్కతుర్తి మండల నాయకులు గొర్ల కాపరి సంఘం జిల్లా అధ్యక్షులు ముష్కే వెంకటేష్ యాదవ్, అంచనగిరి వెంకటరమణ, బీజేవైఎం అధ్యక్షుడు ఎం. శ్రీకాంత్ యాదవ్, పార్టీ భగవాన్ గౌడ్, శ్రావణ్ రెడ్డి, ప్రవీణ్, వినయ్, గుడిశాల అర్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఆన్యువల్ డే సెలబ్రేషన్

**గొల్లపల్లి ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** గోవిందపల్లి అంగన్వాడి కేంద్రంలో ఆన్యువల్ డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రాథమిక విద్య యొక్క ప్రాముఖ్యత గూర్చి తల్లులకు వివరించి చెప్పడము



మంచి అలవాట్లు నేను నా పరిసరాలు సంసిద్ధత ఆటలు పాటలు కథలు సృజనాత్మక కార్యక్రమాలు సంస్కృతిక కార్యక్రమాలు పిల్లలతో చేపిచ్చి ప్రత్యక్షంగా తల్లులకు చూపించి వారికి దాని యొక్క ప్రాముఖ్యత పిల్లల అభివృద్ధి పుస్తకం అసెస్మెంట్ కార్డ్స్ ఇవ్వడం పిల్లల అభివృద్ధి పుస్తకంలో వారు చేసిన కార్యక్రమాలపై శారీరక సామాజిక వ్యక్తిగత భావోద్వేగ మేధో వికాసం భాషాభివృద్ధి బడికి సంసిద్ధత అనే కార్యక్రమాలపై వారికి ఏప్రిల్ నెలలో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత, అంగన్వాడి టీచర్ సరోజన, పిల్లల తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# తెలంగాణ అంబేద్కర్ సంఘ విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలి

**ఎల్కతుర్తి ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల చేరాలు జిల్లా అధ్యక్షులు



అంబాల ఆనంద్ మండల అధ్యక్షులు అంబాల హర్షరాజు ఎల్కతుర్తి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అంబాల సుమన్ పాల్గొని కరపత్ర ప్రచురణ చేశారు అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య మాట్లాడుతూ.... అంబేద్కర్ సంఘం సమావేశానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

# స్విమ్మింగ్ పూల్ లో విజయ్ వర్మ..వెనుక తమ్మన్నా?

మిల్కీబ్యూటీ తమన్నా - బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ డేటింగ్ లో ఉన్నారంటూ మీడియా కథనాలు వెడెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా నెట్టింట ప్రచారం పతాక స్థాయిలో జరుగుతోంది. అయితే ఇటీవలే ఈ కథనాలపై తమన్నా క్లారిటీ ఇచ్చేప్రయత్నం చేసారు. ఇద్దరి మధ్య ఎలాంటి రిలేషన్ షిప్ లేదని...తనతో కలిసి పనిచేసినంత మాత్రాన ప్రేమలో పడిపోతానని కాస్తా ఘాటుగానే స్పందించింది. అయితే వీటిపై విజయ్ వర్మ మాత్రం సైలెంట్ గానే ఉన్నాడు. ఇంత వరకూ అతను వైపు నుంచి క్లారిటీ రాలేదు. అయినా సరే బాలీవుడ్ మీడియాలో ఈ ఎఫైర్ వార్తలు మాత్రం ఆగలేదు. తమన్నా-విజయ్ వర్మ గురించి డేటింగ్ వార్తలు పుంకాలు పుంకాలుగా చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఈ విజయ్ నేడు స్విమ్మింగ్ పూల్లో ఉన్న తన చిత్రాన్ని పోస్ట్ చేశాడు. దానికో క్యాప్షన్ ఇచ్చాడు. %--%యే దేఖ్ కే క్యా సీఖా తుమ్నే?%--% అంటూ రాసుకొచ్చారు. చిత్రం బ్యాక్గ్రౌండ్లో నెమలి బొమ్మ నీరు త్రాగుతున్నట్లు కనిపిస్తుంది. ఆ పక్కనే పూల్ బెంచీ పై సేద తీరుతున్న ఓ గాళ్ కనిపిస్తుంది. సరిగ్గా ఆషాట్ ని ఎవరో క్యాప్చర్ చేయడానికి ప్రయత్నించారు. అయితే విజయ్ వర్మ తలకాయ అడ్డుగా ఉండటంతో ఆమె ఎవరో స్పష్టంగా కనిపించలేదు. దీంతో కొందరు ఆమె తమన్నా అంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. అలాకకపోతే విజయ్ వర్మ ఎందుకు అడ్డుగా ఉంటాడు? నెమలి బొమ్మని పిక్చర్లో క్యాప్చర్ చేయడం వెనుక కారణం ఏమై ఉంటుందంటూ సందేహిస్తున్నారు. అయితే మరికొంత మంది ఆ గాళ్ బయట అమ్మాయి అయి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. క్లారిటీ లేని పిక్చర్ తమన్నా? అని ఎలా కన్ఫమ్ చేస్తారంటూ త మిల్కీ బ్యూటీ అభిమానులు ఫీలవుతున్నారు. మరి ఆ బ్యాకెండ్ లో ఉన్నది తమన్నా? ఇంకవరైనా? అన్నది చూడాలి



## పవన్ ఓజీ.. ఫైర్ స్టామ్ అప్డేట్..!

సాహెూ తర్వాత సుజిత్ చాలా గ్యాప్ తీసుకుని ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తోనే సినిమా ఫిక్స్ చేసుకున్నాడు. పవన్ సుజిత్ అసలేమాత్రం ఊహించని ఈ కాంబో సినిమా ఎనౌన్స్ మెంట్ ఫ్యాన్స్ కి మాంచి కిక్ ఇచ్చింది. పవర్ స్టార్ తో గ్యాంగ్ స్టర్ సినిమా చేస్తున్న సుజిత్ సినిమా మొదలైనప్పటి నుంచి భారీ క్రేజ్ తెచ్చుకున్నాడు. ఇక లేటెస్ట్ గా సినిమా నుంచి ఓ స్పెషల్ అప్డేట్ ఫ్యాన్స్ కి స్పెషల్ ట్రీట్ ఇచ్చింది. పవన్ ఓజీ సినిమా క్లైమాక్స్ సీన్ రాస్తున్న సుజిత్ కి సూపర్ ఎలివేషన్ ఇచ్చారు. తన చేతిలో కత్తి బుల్లెట్స్ ఇలా సినిమా ఎలా ఉండబోతుంది అన్నది ఇండికేట్ చేశారు. క్లైమాక్స్ సీన్ కోసం తను ఎంత కష్టపడ్డాడు అన్నది చూపించారు. ఇక ఫైనల్ గా పవర్ స్టార్ ఫైర్ స్టాం త్వరలో రాబోతుంది అని అప్డేట్ ఇచ్చారు. పవర్ స్టార్ సినిమాల్లో ఆయనకే కాదు ఆయన్ను డైరెక్ట్ చేసే దర్శకులకు ఎలివేషన్స్ అదిరిపోతున్నాయని చెప్పొచ్చు. పవన్ కళ్యాణ్ సుజిత్ కాంబోలో వస్తున్న ఈ సినిమాకు ఓజీ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్టు టాక్. ఈ సినిమాను ఆర్.ఆర్.ఆర్ మూవీ నిర్మాత డివివి దానయ్య నిర్మిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమాని అయిన సుజిత్ పవర్ స్టార్ ని ఒక డైరెక్టర్ గానే కాదు అభిమానిగా కూడా ఫ్యాన్స్ ఎలా చూడాలని అనుకుంటున్నారో అలా చూపించాలని అనుకుంటున్నాడు. గ్యాంగ్ స్టర్ కథల్లో పవన్ ప్రయత్నాలన్నీ ఇదివరకు చేసినా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. కానీ ఈసారి సుజిత్ నెక్స్ట్ లెవల్ లో ఈ సినిమా ఉండేలా చేస్తున్నాడట. సినిమా నుంచి వచ్చిన లేటెస్ట్ అప్డేట్ మాత్రం ఫ్యాన్స్ ని పిచ్చెక్కించేస్తోంది. ఈ రేంజ్ ఎలివేషన్స్ లో పవర్ స్టార్ ని ఊహించుకుంటేనే సినిమా రేంజ్ ఏంటన్నది అర్ధమవుతుంది. సాహెూతో మిస్సైన టార్గెట్ ని పవన్ కళ్యాణ్ ఓజీతో బద్దలు కొట్టాలని చూస్తున్నాడు సుజిత్. ఓజీ సినిమా షూటింగ్ ముంబైలో మొదలైంది. ఈ అప్డేట్ ని అందిస్తూ రిలీజ్ చేసిన ఫైర్ స్టామ్ వీడియో పవర్ స్టార్ ఫ్యాన్స్ ని విశేషంగా ఆకట్టుకుంటోంది.

## మహేష్ ఆరోగ్యం అతని చేతుల్లో..

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు తన నటన విషయంలో ఎంతగా జాగ్రత్తలు తీసుకుంటాడో.. ఫిట్నెస్ పట్ల కూడా అంతే అంకితభావంతో ఉంటాడు. క్రమం తప్పకుండా జిమ్కి వెళ్తాడు. అలాగే కుటుంబ విహారయాత్రలో ఉన్నప్పుడు కూడా తన టోన్డ్ ఫిజిక్ని మెయింటెయిన్ చేయడానికి ఏమాత్రం అశ్రద్ధ వహించడు. ఆరోగ్యం పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధత ఆయన్ను ఎందరికో రోల్ మోడల్గా మార్చింది. ఇటీవల ఈ స్టార్ నటుడు తన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకున్నందుకు నేచురోపతి డాక్టర్ హ్యారీ కోనిగ్ పట్ల కృతజ్ఞతలు



తెలిపాడు. తన సోషల్ మీడియా ఎకౌంట్ లో ఫోటో కూడా షేర్ చేశాడు. జర్మనీలో ఉన్న ప్రఖ్యాత వైద్యుడు డాక్టర్ కోయినిగ్ ను పరిచయం చేస్తూ.. మహేష్ బాబు ఇలా వివరణ ఇచ్చారు "ధన్యవాదాలు ఏ%ఎతీష్ఘుతీ-తీఎనిశీవఅఱస్త్ర%! నా ఆరోగ్యం మెరుగైన చేతుల్లో.. అంటూ అతని గురించి ఒక క్యాప్షన్ ఇచ్చాడు. మహేష్ చాలా సంవత్సరాలుగా ఈ వైద్యుని సంరక్షణలో ఉన్నాడని అతని చికిత్సల నుండి ఎంతో ప్రయోజనం పొందాడని ఇది అర్ధమవుతుంది. ఇక మహేష్ బాబు అభిమానులు అతని రాబోయే చిత్రం %ూవీదీ%28 విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ సినిమా జనవరి 2024 జనవరి 13 న విడుదల కానుంది. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమా తర్వాత రాజమౌళి దర్శకత్వంలో మరొక సినిమాను మొదలు పెట్టబోతున్న విషయం తెలిసిందే. ఆ ప్రాజెక్టుపై కూడా అంచనాలు గట్టిగానే ఉన్నాయి. ఆ సినిమాను దర్శక ధీరుడు హాలీవుడ్ రేంజ్ లో భారీ బడ్జెట్లో తెరపైకి తీసుకువచ్చే అవకాశం అయితే ఉంది. ఇప్పటికే కథ పూర్తయినట్లు సమాచారం. ఇక ఈ ఏడాది సెప్టెంబర్ నెలలోనే వర్క్ షాప్ మొదలుపెట్టే సినిమా రెగ్యులర్ షూటింగ్ మాత్రం 2024 సమ్మర్లో స్టార్ట్ అవ్వచ్చు అని తెలుస్తోంది

# ఘనంగా రవీంద్ర ప్లే స్కూల్ రంగోత్సవ్-2023 సంబరాలు

**జగిత్యాల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** పట్టణం లోని రవీంద్ర ప్లే స్కూల్ లో ఘనంగా " రంగోత్సవ్ 2023 " పేరిట శనివారం నిర్వహించిన వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి.



నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులకు కనువిందు చేసాయి. శివ తాండవం, ఆంజనేయ స్వామి కథ, పౌరాణిక రూపం, విద్యార్థుల తల్లులు చేసిన నృత్యాలు, నర్సరీ పిల్లలు అమ్మ పాట పైన వారి తల్లులతో చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ముఖ్యంగా "తండ్రి - తనయులు" అనుబంధం పైన చేసిన నాటిక చూపరులను ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుమన్ రావు, శ్రీధర్ రావు, హరిచరన్ రావు,





మౌనిక- హరి చరణ్ రావు, రజిత, కొమురవెల్లి కిషన్, రాజు తో పాటు పోషకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముంబైలో జూన్ 4న అఖిల భారత తెలుగు మహాసభలు

**కోరుట్ల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** ముంబైలో ప్రముఖ తెలుగు సంస్థలతో కలిసి 'అఖిల భారత తెలుగు మహాసభలు" నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామనీ, ముంబైలో తెలుగు భాష, సాహిత్యం, కళల విస్తరణ లక్ష్యంగా ఈ మహాసభలు ఉంటాయని" పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు తంగెడ కిషన్ రావు వెల్లడించారు. గురువారం ముంబై ఆంధ్ర మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్, నవీ ముంబై తెలుగు కళా సమితి ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి కొండారెడ్డి నేతృత్వం లో హైద్రాబాద్ చేరుకున్న ప్రతినిధి మండలితో నిర్వహించిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడారు. "మూడు రోజుల పాటు నిర్వహించబోయే ఈ మహాసభల్లో మహారాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలుగు సంఘాలన్నింటికి ప్రాతినిధ్యం కల్పిస్తామని, అక్టోబర్ మొదటివారంలో ఈ మహాసభలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రతినిధి మండలిలో ఆంధ్ర మహాసభ ధర్మకర్తల మండలి చైర్మన్ బోగా సహదేవ్, ట్రస్టీ గాలి మురళీధర్, ప్రధాన కార్యదర్శి వేముల మనోహర్, పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులు యేలిగేటి రాజ్ కుమార్, సాహిత్య, క్రీడా విభాగ ఉపాధ్యక్షులు సంగెవేని రవీంద్ర పాల్గొన్నారు.. విశ్వవిద్యాలయం తరఫున ఉపాధ్యక్షులు తంగెడ కిషన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్, సమన్వయకర్త మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు. ముంబైలో జూన్ 4న ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించబోయే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో మంత్రి తన్నీరు హరీష్ రావు తో పాటు మరో ఇద్దరు మంత్రులు పాల్గొంటామని ముంబై ఆంధ్ర మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్ ఆధ్వర్యంలో మంత్రిని కలుసుకున్న



ప్రతినిధి మండలితో భేటీ అయిన సమయం లో హామీ ఇచ్చారని సుధాకర్ అన్నారు. ముంబైలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనినవల్సిందిగా కోరుతూ ప్రతినిధి మండలి ఆయనకు వినతి పత్రం సమర్పించారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ తన అంగీకారాన్ని తెలియచేశారు. ఈ ప్రతినిధి మండలిలో మహాసభ ఉపాధ్యక్షులు యేలిగేటి రాజ్ కుమార్, సంగెవేని రవీంద్ర, ప్రధాన కార్యదర్శి వేముల మనోహర్, ధర్మకర్త గాలి మురళీధర్ పాల్గొన్నారు.




## క్రిస్మస్ టార్గెట్తో నాని 30..!

నేచురల్ స్టార్ నాని దసరా సినిమా హిట్ తో మంచి ఊపు మీద ఉన్నాడు. దసరా సక్సెస్ కొట్టినా ఏమాత్రం లేట్ చేయకుండా తన నెక్స్ట్ సినిమా షూటింగ్ లో పాల్గొన్నాడు నాని. వైరా క్రియేషన్స్ బ్యానర్ లో శౌర్యువ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న నాని 30వ సినిమా లేటెస్ట్ గా రిలీజ్ డేట్ లాక్ చేశారు. దసరా తో సమ్మర్ కు సూపర్ స్టార్ట్ ఇచ్చిన నాని తన నెక్స్ట్ సినిమా డిసెంబర్ లో రిలీజ్ ఫిక్స్ చేసుకున్నాడు. డిసెంబర్ 21న నాని 30వ సినిమా రిలీజ్ లాక్ చేశారు. క్రిస్ మస్ కానుకగా నాని సినిమా రిలీజ్ కాబోతుంది. సినిమాలో నాని సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాలో నాని మరోసారి తండ్రి పాత్రలో నటిస్తున్నారు. ఆల్రెడీ జెర్సీ సినిమాలో నాని ఫాదర్ రోల్ లో మెప్పించారు. తెలుగు ప్రేక్షకులకు కొత్త కథలను అందిస్తూ తన మార్క్ నటనతో మెప్పిస్తూ వస్తున్నారు నాని. దసరా హిట్ తర్వాత నాని రేంజ్ పెరిగింది. అయితే నాని 30 మరో ప్రయోగాత్మక సినిమాగా వస్తుందని తెలుస్తోంది. నాని 30వ సినిమా డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రస్తుతం గోవాలో షూటింగ్ జరుపుకుంటుంది. సీతారామం తో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటించడం సినిమాకు కలిసి వచ్చే అంశమే అని చెప్పొచ్చు. ఏడాదికి రెండు సినిమాల టార్గెట్ తో సినిమాలు చేస్తున్న నాని దసరా తర్వాత మరో ఇంట్రెస్టింగ్ మూవీతో ఈ ఏడాది మరో హిట్ కొట్టాలని చూస్తున్నాడు. నాని సినిమా కథ ఏంటి.. సినిమా ఎలా ఉండబోతుంది లాంటి విషయాల గురించి మరిన్ని డీటైల్స్ త్వరలో రానున్నాయి. అయితే టాలీవుడ్ లో డిసెంబర్ సెంటిమెంట్ కొందరికి ఉంది. క్రిస్మస్ రేసులో వస్తే సినిమా హిట్ అనే టాక్ ఉంది. ఇప్పటికే కొన్ని సినిమాలు క్రిస్ మస్ కి రిలీజ్ ప్లాన్ చేశారు. మరి నాని 30వ సినిమా ఏ సినిమాలతో పోటీ పడుతుందో చూడాలి

## హిట్లిచ్చినా హీరో కోసం చకోర పక్షిలా ఎదురు చూపు!

ఏడాదికి కనీసం రెండు సినిమాలైనా రిలీజ్ చేయాలన్నది స్టార్ హీరోల డైరీలో ఎప్పుడూ ఉంటుంది. కానీ అది ప్రాక్టీకల్ గా సాధ్యపడటం లేదు. ఒక సినిమా పూర్తి చేసి రిలీజ్ చేయడమే అతి కష్టం మీద జరుగుతుం ది. అందులోనూ రాజమౌళి లాంటి దర్శకులు ఎంటర్ అయితే? అదే హీరో రెండేళ్ల పాటు మరో సినిమా చేసే అవకాశం ఉండదు. ఆరకంగా హీరోలు లాక్ అవుతున్నారు. ఈ సమస్య ఇక్కడే కాదు. అన్ని పరిశ్రమల్లోనూ కనిపిస్తుంది. హీరోలు డేట్లు అడ్జస్ట్ చేయడం అన్నది అన్ని భాషల్లోనూ కష్టంగానే మారుతుంది. భవిష్యత్ లో ఈ పరిస్థితి మరింత జఠిలం అవుతుంది. ఇప్పుడు హీరోలంతా పాన్ ఇండియా మోజులో ఉన్నారు. అందుకు తగ్గట్టే వాళ్ల ప్రణాళిక కనిపిస్తుంది. ఎక్కువ సమయం తీసుకునైనా సరైన హిట్ కంటెంట్ తోనే రావాలని బలంగా కదులుతున్నారు. ఈ క్రమంలో రిలీజ్ కి ఎంత గ్యాప్ వచ్చినా ప్రామాణికంగా కనిపించడం లేదు. అయితే ఈ కారణంగా భారీ విజయాలు అందుకున్న దర్శకులకు మాత్రం వెయిటింగ్ తప్పడం లేదు. హీరోల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆ హీరో ఎప్పుడు డేట్లు కేటాయిస్తాడా? అని చకోర పక్షిలా ఎదురుచూడాల్సి వస్తోంది. హీరోలు స్టోరీలు విని బాగున్నాయని. తప్పకుండా చేద్దాం అని ప్రామిస్ చేస్తున్నారు. కానీ అదెప్పుడు? అన్నది మాత్ర క్లారిటీ ఇవ్వడం లేదు. ఇటీవలే ఓ దర్శకుడు పలువురు స్టార్ హీరోల్ని



కలిసి కథలు చెప్పారు. తెలుగులో పాటు కోలీవవుడ్ లో కొందరు హీరోలకు నెరేట్ చేసారు. కథలు నచ్చి చేద్దామని మాట ఇచ్చారు. కానీ ఎప్పుడు ప్రారంభిద్దాం అన్న అంశం పై మాత్రం క్లారిటీ రావడం లేదు. ఇలాంటి హిట్ డైరెక్టర్లు చాలా మందే ఉన్నారు. హీరోల కారణంగా అలాంటి ప్రతిభావంతులంతా ఖాళీగా ఉండిపోవాల్సి వస్తోంది. ఓ రకంగా అలాంటి వాళ్లకు ఇది భారీ నష్టమనే చెప్పాలి. కోట్ల రూపాయల నష్టాన్ని చూడాల్సి వస్తోంది. ఎన్టీఆర్ -బుచ్చిబాబు ప్రాజెక్ట్ విషయంలో ఏం జరిగిందో తెలిసిందే. చివరి నిమిషంలో రామ్ చరణ్ -బుచ్చిబాబు కథకి ఒకే చెప్పకపోతే గనుక అతని రెండేళ్ల శ్రమ వృద్ధా అయ్యేది. అలాగే కొరటాల శివ తాజా సినిమా విషయంలో ఎంతగా నలిగిపోయాడో? యంగ్ టైగర్ ఒకే చెప్పినా సెట్స్ కి వెళ్లడానికి కొన్ని నెలలు సమయం పట్టింది. స్టోరీ లైన్ ఒకే అయిన తర్వాత హీరోల నుంచి ఈ రకమైన ఇబ్బందులు ఉంటున్నాయి

# పేదలకు ఇళ్ల స్థలాల కోసం ధర్నా

### సిపిఎం నాయకునిపై దాడి

**కోరుట్ల ఏప్రిల్ 15 (ప్రజామంటలు):** పేదప్రజలకు 100 గజాల ఇళ్ళ స్థలల కోసం సంగెం రోడ్ జమ్మిగద్దె వాగు వద్ద గత 6 రోజులుగా సిపిఎం అధ్వర్యంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు 6 వ




రోజున యదావిధిగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా అయిపోయిన తర్వాత తిరిగి తమ ఎక్స్ఎల్ వాహనంపై వాగు దాటి కోరుట్ల లోకి ప్రవేశించిన తర్వాత ఒక కౌన్సిలర్ భర్త సుమారు 20 మందితో కలిసి వచ్చితమపై కర్రలతో దాడి చేశారని తిరుపతి నాయక్ తెలిపారు. ఈ సంఘటన పై భాద్యులపై చర్య తీసుకోవాలని అతను స్థానిక కోరుట్ల పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.

## శాకుంతలం ఆ పాత్రలు వేరే వాళ్లు చేసి ఉంటే..?

శాకుంతలం' సినిమా ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోవడానికి రకరకాల కారణాలు ఉన్నాయి. అందులో మిస్ట్ కాస్ట్ కూడా కీలకమైన



అంశం. శకుంతల దుష్యంతుల పాత్రలకు సరైన ఆర్టిస్టులను తీసుకోకపోవడం వల్ల ఆ పాత్రలు పండలేదని.. కెమిస్ట్రీ కూడా వర్కవుట్ కాలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. చరిత్ర ప్రకారం శకుంతల.. దుష్యంతుల కలయిక జరిగే సమయానికి వారి వయసు 16 21 ఏళ్లు మాత్రమే. దుష్యంతుడిగా చేసిన మలయాళ నటుడు దేవ్ మోహన్ ఓకే అనిపిస్తాడు కానీ.. 35 ఏళ్ల వయసున్న సమంతను శకుంతలగా చూపించడం కరెక్టా అనే చర్చ నడుస్తోంది. చిన్న వయసుండి ముగ్ధ మనోహరమైన అందంతో కనిపించే కథానాయిక ఎవరైనా ఈ పాత్ర చేయాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శకుంతల అనగానే అందంతో పాటు అమాయకత్వం ఉట్టి పడాలి. ఫ్యామిలీ మ్యాన్-2 పుష్ప ఐటెం సాంగ్ లాంటి వాటిలో సమంతను చూసి శకుంతలగా ఆమెను చూడటం అంటే ఇబ్బందే. ఆమె మంచి నటే కావచ్చు కానీ.. ఈ వయసులో కెరీర్లో ఈ దశలో తనకు శకుంతల పాత్ర సూట్ కాలేదు. ఏ శ్రీలీల లాంటి యంగ్ హీరోయినో అయి ఉంటే ఆ పాత్రకు సూటయ్యేదేమో. ఇక దుష్యంతుడి పాత్రలో దేవ్ మోహన్ ఉన్నంతలో బాగా చేసినా.. కొత్తవాడైన అతడితో మన వాళ్లు కనెక్ట్ కాలేదు. చక్రవర్తి పాత్ర.. పైగా యుద్ధాలున్నాయి అంటే.. మాస్ ఇమేజ్ ఉన్న తెలుగు స్టార్ ఎవరైనా ఆ పాత్ర చేయాల్సింది. అప్పుడు తెరపై అతను వీరత్వం చూపిస్తుంటే ప్రేక్షకులకు కిక్కు వచ్చేది. ఇలాంటి పాత్రలు మాస్ ఫాలోయింగ్ ఉన్న వాళ్లు చేస్తేనే బాగుంటుంది. ఆ పాత్రలో ఎవరైనా బాగుండేది అని పర్టికులర్గా చెప్పలేం కానీ.. స్టార్ ఇమేజ్ ఉన్న తెలుగు హీరోలే చేయాల్సిందన్నది మాత్రం స్పష్టం. రెండు ప్రధాన పాత్రలకు ఆర్టిస్టుల ఎంపికలోనే తేడా జరగడంతో 'శాకుంతలం'తో ప్రేక్షకులు కనెక్ట్ కావట్లేదన్నది స్పష్టం

## అప్పుడీ మగాళ్లంతా ఏం చేస్తున్నారు?

దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేరు ఇటీవల వివాదాల్లో హాట్ టాపిక్ గామారుతోన్న సంగతి తెలిసిందే. నాటు నాటుకి ఆస్కార్ రావడం వెనుక భారీగా డబ్బు ఖర్చు చేసారంటూ వ్యాఖ్యానించడంతో ఆయనపై కొందరు ఆగ్రహజ్వాలలతో రగిలిపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులికి మ్యాటర్ సైలెంట్ అయింది. అయితే తాజాగా మరోసారి పరిశ్రమ ని ఉద్దేశించి సంచనల వ్యాఖ్యలు చేసారు. తనని తప్పుగా అర్ధం చేసుకున్న



వారిని ఒకటే అడుగుతున్నానంటూ మొదలు పెట్టి చెడుగడు ఆడుకున్నారు. ఆ మధ్య ఎంపీనో..ఎమ్మెల్యేనో సినిమా వాళ్ల ఫ్యామిలీ మహిళల గురించి అసభ్యంగా మాట్లాడారు. ఆ రోజు నుంచి ఇప్పటివరకూ దీని గురించి నేను మాట్లాడుతున్నాను. నేనొక్కడిని మాత్రమే మాట్లాడుతున్నా. మరి మిగిలినీ మగాళ్లంతా ఏమయ్యారు. వాళ్లెందుకు మాట్లాడటం లేదు. ఒక్కరు నోరు పెగలడం లేదేం? ఆర్ ఆర్ ఆర్ గురించి ఏదో అన్నాను మగాళ్లంతా పోగేసుకుని వచ్చారు? మరి పరిశ్రమలో ఫ్యామిలీస్ గురించి మాట్లాడినప్పుడు వీళ్లంతా ఏమయ్యారు. రాజకీయ నాయకులు అని భయపడుతున్నారా? ఈ మధ్య మరో ఎంఎల్ ఏ సినిమా వాళ్లు ఆస్తులు దోచుకున్నారని అన్నాడు. అప్పుడు కూడా నేనే స్పందించా. దమ్ముంటే రా నిరూపించు అని ఛాలెంజ్ విసిరా. అప్పుడు కూడా ఈ మగాళ్లంతా ఏమైపోయారు. నన్ను ఛాలెంజ్ చేసిన బ్యాచ్ ఎక్కడికి వెళ్లిపోయింది? ఆడవాళ్లని అనడం ఏంటి? అన్న అంశం గురించి ఆర్ఎస్ఎస్కి చెందిన మోహన్ భగవత్ని కూడా ఈ విషయం అడిగాను. ఆయన కూడా ఇది చాలా తప్పు అని అన్నారు. నువ్వెవడివిరా అడగడానికి..నీకేం స్థోమత ఉంది అని సోషల్ మీడియాలో కొందరు నన్ను అంటారు. నాకు స్థోమత లేదు. కానీ అడిగే ధైర్యం ఉంది. మీ ఫ్యామిలీస్ని కాపాడుకునే ధైర్యం మీకు లేదు. మీరంతా పిరికివాళ్లు. మనల్ని మన వాళ్లను కాపాడుకోగలిగినప్పుడే.. రాష్ట్రానికి దేశానికి ఏమైనా చేయగలం అని ఆగ్రహం వ్యక్తం చేసారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com